# శుభోదయం!
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి : 02, సంచిక : 152, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం - 21 - ఆగష్టు - 2025

### మాకు ఢిల్లీలో మాకు ఏ బాస్ లేదు
## ఏ పార్టీ మా బాస్ కాదు

ఉప రాష్ట్రపతి ఎన్నికలు.. 'మద్దతు'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన కేటీఆర్

మాకు ఢిల్లీలో ఎవరూ బాస్‌లు లేరు.

మా బాస్‌లు ఎవరైనా ఉన్నారంటే.. తెలంగాణ ప్రజలే తప్ప.. మాకు ఢిల్లీలో ఆజ్ఞపించే, ఆదేశించేవారు ఎవరూ లేరు.

'తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థిని పెట్టి ఇదిగో మా చిత్తశుద్ధి అని చెప్పుకునేది ఉండే. బీసీలపై ప్రేమ మాత్రం నోట్లోనే ఉంటది.



హైదరాబాద్: ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో మీ పార్టీ స్టాండ్ ఏంటీ? అన్న ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక విషయంలో అటు ఎన్‌డీఏ, ఇటు ఇండియా తమ తమ అ అభ్యర్థులన్ని ప్రకటించాయి. కానీ, బీఆర్ఎస్ అనేది సర్వస్వతంత్రమైన పార్టీ. మాకు ఢిల్లీలో ఎవరూ బాస్‌లు లేరు. మాకు ఢిల్లీలో మాకు ఏ బాస్ లేదు. ఏ పార్టీ మా బాస్ కాదు. మా బాస్‌లు ఎవరైనా ఉన్నారంటే.. తెలంగాణ ప్రజలే తప్ప.. మిగతా.. 2లో

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర ఉంది!

## దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డిల పాత్ర ఎంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 1994 నుండి 2014 వరకు హైదరాబాద్ నగరాన్ని ఆనాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని ఆయన అన్నారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైటెక్ సిటీని నిర్మిస్తున్న సమయంలో చాలామంది అవహేళన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యో నగరాలతో పోటీ పడుతోందని తెలిపారు. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం చాలా అవసరమని అన్నారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థల్లో తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ చొరవతోనే ఐటీ రంగంలో చాలామంది రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాలో మన ఐటీ నిపుణులు పనిచేయడం ఆపేస్తే ఆ దేశం స్తంభించిపోతుందని అన్నారు. మన ప్రాంతం విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని నాటి ముఖ్యమంత్రులు పలు విద్యాసంస్థలను నిర్మించారని తెలిపారు. ఇప్పుడు మనం హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడుతుంటే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారిని ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మూసీ నది ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని ఆయన అన్నారు. మిగతా.. 2లో



- ★ 1994 నుండి 2014 వరకు నాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారు
- ★ హైటెక్ సిటీని కట్టినప్పుడు అవహేళన చేశారు
- ★ ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారు
- ★ హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యో నగరాలతో పోటీ పడుతోంది
- ★ గూగుల్ వంటి దిగ్గజ సంస్థల్లో తెలుగువారు ఉన్నారు



2లో

### 17వ రోజుకు చేరుకున్న సినీ కార్మికుల సమ్మె...
### సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

రంగంలోకి దిగిన తెలంగాణ ప్రభుత్వం

సినిమా హబ్ లక్ష్యానికి దెబ్బ అని సర్కార్ ఆందోళన

ఫెడరేషన్ నేతలతో మాట్లాడనున్న డీజీపీ



### తెలంగాణలో ముగుస్తున్న వైన్ షాపుల లైసెన్సులు..

ప్రభుత్వం కీలక నిర్ణయం

- తెలంగాణలో మద్యం దుకాణాలపై ప్రభుత్వ కీలక నిర్ణయం
- నవంబర్ 30తో ముగియనున్న ప్రస్తుత లైసెన్సుల గడువు
- జనాభా ప్రాతిపదికన కొత్త లైసెన్స్ ఫీజుల ఖరారు
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తింపు

### 'ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రుల తొలగింపు బిల్లు' పై ప్రతిపక్షాల ఫైర్

రాజ్యాంగ విరుద్ధమంటూ మండిపడ్డ ప్రియాంకా గాంధీ



2లో

నియంతృత్వ పోకడలకు దారితీసేలా ఉందని నేతల విమర్శ

రాజకీయ ప్రత్యర్థుల నుంచి అధికారం లాక్కునే ఆయుధం

### యూఎస్ మార్కెట్‌లో కష్టాలా? రండి.. మేం ఉన్నాం: భారత్‌కు రష్యా భరోసా




2లో

- భారత ఉత్పత్తులకు తాము స్వాగతం పలుకుతామని రష్యా బంపర్ ఆఫర్
- రష్యా నుంచి చమురు కొనుగోలుపై భారత్‌పై అమెరికా ఒత్తిడి అన్యాయమని వ్యాఖ్య
- భారత్‌కు రష్యానే అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు అన్న రష్యా డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్

# మీ వద్ద కొత్త ఐడియా ఉంటే దాన్ని అభివృద్ధి చేసే వేదిక ఏపీ

## మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం




- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్న సీఎం చంద్రబాబు
- 'ఇంటికి ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యంగా కొత్త పిలుపు
- ఆవిష్కరణలకు మెంటరింగ్, ఫండింగ్‌తో పూర్తి ప్రోత్సాహం
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్

అమరరావతి: మీ దగ్గర ఒక మంచి ఆలోచన ఉందా? దాన్ని ఆచరణలో పెట్టి విజయవంతం చేయాలని చూస్తున్నారా? అయితే ఆంధ్రప్రదేశ్ మీకు సరైన వేదికగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు యువతకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' అన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రతన్ టాటా ఆలోచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని, ఆయన ఆశయాలను సజీవంగా ఉంచేందుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఐదు కేంద్రాల్లో జీఎంఆర్, గ్రీన్‌కో, మేఘా, అదానీ, జిందాల్ వంటి ప్రముఖ సంస్థలు యువతకు శిక్షణ ఇస్తాయని వివరించారు. టాటా సన్స్ సీఈఓ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని ప్రశంసించారు. ఈ ఇన్నోవేషన్ హబ్‌లు నూతన ఆవిష్కరణలకు గొప్ప వేదికగా నిలుస్తాయని ఆయన అన్నారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకునేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని, ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణల హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్‌టీఐహెచ్)ను టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మిగతా.. 2లో

### ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్ నామినేషన్

ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్

ప్రధాని మోదీ, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రుల హాజరు

సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్



ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీతో రాధాకృష్ణన్ గెలుపు ఖాయం

ఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం చోటుచేసుకుంది. అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ మిగతా 2 లో



2లో

### పిఠాపురం మహిళలకు పవన్ కల్యాణ్ శ్రావణ శుక్రవారం కానుక

- 10 వేల మందికి చీరలు, పసుపు, కుంకుమల పంపిణీకి ఏర్పాట్లు
- పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ
- ఆగస్టు 22న ఐదు విడతలుగా కార్యక్రమం
- కూపన్ల ఆధారంగా సమయాల కేటాయింపు

# 30 రోజులు కస్టడీలో ఉంటే ప్రధాని, సీఎం పదవులు కోల్పోయే కీలక బిల్లు..

- లోక్‌సభలో విపక్షాల నిరసన
- వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే సీఎం, పీఎం పదవి రద్దు
- ఐదేళ్లకు పైగా శిక్షపడే కేసులకు ఈ నిబంధన వర్తింపు
- ఇది ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అంటూ విపక్షాల ఆందోళన
- కేంద్రంపై అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం
- విపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా

ఢిల్లీ: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తమ పదవిని కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులు లోక్‌సభలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ సంచలన నిబంధనలతో కూడిన బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం సభలో ప్రవేశపెట్టగా, విపక్షాలు వ్యతిరేకించాయి. కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు మిగతా.. 2లో






2లో

### మంత్రి లోకేశ్ చొరవతో ఏపీకి కేంద్రం అధిక ప్రాధాన్యం

- ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా వేగంగా అడుగులు
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషికి కేంద్రం మద్దతు
- సమగ్రశిక్షకు గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధుల మంజూరు



2లో

### లోక్‌సభలో 'ఆన్‌లైన్ గేమింగ్' రగడ.. ప్రతిపక్షాల ఆందోళనతో దద్దరిల్లిన సభ!

లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం

సరిహద్దులు దాటి, విదేశాల నుంచి ఆడే మనీ గేమ్‌లపై పూర్తి నిషేధానికి ప్రతిపాదన

బిల్లు ప్రవేశపెట్టగానే తీవ్ర గందరగోళం సృష్టించిన ప్రతిపక్షాలు

ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అసంతృప్తి

## మాకు ఢిల్లీలో మాకు ఏ బాస్ లేడు

# ఏ పార్టీ మా బాస్ కాదు



తెలంగాణ ప్రజలే తప్ప.. మాకు ఢిల్లీలో ఆజ్ఞాపించే, ఆదేశించేవారు ఎవరూ లేరు. మా పార్టీని ఇప్పటి వరకు సంప్రదించలేదు. ఈ కూటమి, ఆ కూటమి ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదు, మమ్మల్ని అడగలేదు. ఏం ఒక పార్టీగా కేవలం మీడియాలో చూసిందే తప్ప ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుందని.. తమని సంప్రదించింది లేదు. ఇంకా టైమ్ ఉంది. సెప్టెంబర్ 9న ఎన్నిక కాబట్టి.. కూర్చొని ఆలోచించి.. ఎన్నికల తేదీ నాటికి మా వైఖరిని ప్రకటిస్తాం. ఒకటి మాత్రం గుర్తు చేస్తున్నా. ఏం ఎన్‌డీఏ కూటమిలో, ఇండియా కూటమిలో లేము. ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు చేయాలనే విషయంలో ఢిల్లీ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ ఒత్తిడికి తలొగ్గాల్సిన అవసరం లేదు'

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

'మేం తెలంగాణ ప్రజలకు మూడ్‌కు అనుగుణంగా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ప్రయోజనాలకు అనుగుణంగా ఏ నిర్ణయమైనా తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రేవంత్‌రెడ్డి పెట్టిన వ్యక్తి అయితే తాము వ్యతిరేకిస్తాం. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ, థర్డ్ క్లాస్ పార్టీ ఇవాళ రాష్ట్రంలో ప్రజలను ఎంత అరిగోస పుచ్చుకుంటున్నదో రాష్ట్ర ప్రజలకు తెలుసు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి.. థర్డ్ క్లాస్ పార్టీ పెట్టిన అభ్యర్థిని మేం సమర్థిస్తామని మీరెలా అనుకుంటారు? ఇవాళ జరుగుతున్నది అంతా ఒక డ్రామా. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో డ్రామా. నిన్న మొన్నటి వరకు ఇదే రేవంత్‌రెడ్డి ఏమన్నడు ? బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధితో ఉన్నది. బలహీన వర్గాల విషయంలో ఢిల్లీ వరకు కొట్లాడుతాం.. అవసరమైతే అంతరిక్షం వరకైనా కొట్లాడుతం అన్నడు. మరి బీసీని అభ్యర్థిగా ఎందుకు పెట్టలేదు. అంత ప్రేమ ఉన్నప్పుడు బీసీ అభ్యర్థిని పెట్టలేదు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థి దొరకలేదా? కంచ ఐలయ్యను పెట్టాల్సింది' అన్నారు.

బీసీలపై ప్రేమ నోట్లోనే ఉంటది..

'తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థిని పెట్టి ఇదిగో మా చిత్తశుద్ధి అని చెప్పుకునేది ఉండే. బీసీలపై ప్రేమ మాత్రం నోట్లోనే ఉంటది. ఎన్నికల్లో నిలబెట్టే సరికి బీసీలు కనిపించరు మీకు. మీ మాటలు మేం నమ్మాలి.. మీ వెనుకలా నిలబడాలి. మీరేమైనా మెర్బాని చేస్తున్నారా మాకు. మాది స్వతంత్రమైనా పార్టీ. ఎన్‌డీఏ, ఇండియాలో లేము. మోదీ మా బాస్ కాదు.. రాహుల్ మా బాస్ కాదు. తెలంగాణ ప్రజలు మా బాస్‌లు. వారి ఆలోచన, అభిప్రాయానికి అనుగుణంగా మా నిర్ణయం ఉంటుంది. ఒకటిమాత్రం వాస్తవం. కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే. తెలంగాణను ఇద్దరూ ముంచినవారే. 11 ఏళ్లు బీజేపీ ఏం చేయలేదు. 20 నెలలుగా కాంగ్రెస్ ఏమీ చేయలేదు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. ఆ ఇద్దరు అభ్యర్థులను సీరియస్‌గా తీసుకోవాల్సిన ఆలోచన ఉంటుందని వ్యక్తిగతంగా నేను అనుకోను. కానీ, నా అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదు. పార్టీగా కూర్చొని ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇన్‌చార్జీలు, రాష్ట్ర కమిటీ.. అవసరమైతే కేసీఆర్‌తో అభిప్రాయాలు చెప్పి పార్టీగా ఒక నిర్ణయం తీసుకుంటాం. వ్యక్తిగతంగా మాత్రం కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. రెండు తెలంగాణకు పనికివచ్చే పార్టీలు కాదు. రెండు ఢిల్లీ పార్టీలే, వాటిని పట్టించుకోవాల్సిన, వాటి రాజకీయం కోసం ఆలోచించాల్సిన అవసరం లేదనేది వ్యక్తిగతంగా నా అభిప్రాయం' అన్నారు.

## ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్ నామినేషన్



ఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం చోటుచేసుకుంది. అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమం ఎన్డీఏ కూటమి ఐక్యతను, బలాన్ని ప్రదర్శించేలా సాగింది. రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనా వేస్తున్నారు.

## మీ వద్ద కొత్త ఐడియా ఉంటే

# దాన్ని అభివృద్ధి చేసే వేదిక ఏపీ




చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత ఆలోచనలే కీలకమని అన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, వినూత్న ఆలోచనలకు ఊతమివ్వడానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు తెలిపారు. "ఆలోచనలపై పెట్టే పెట్టుబడి, మౌలిక వసతులపై పెట్టే పెట్టుబడితో సమానం. అందుకే రాష్ట్రంలో ఆవిష్కరణలకు అనువైన ఒక బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నాం. క్షేత్రస్థాయి నుంచి వచ్చే సరికొత్త ఐడియాలకు చేయూతనిచ్చి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఒక వేదికగా నిలుస్తుంది" అని ఆయన వివరించారు. ఈ హబ్ ద్వారా అద్భుతమైన ఆలోచనలకు అవసరమైన మార్గనిర్దేశం (మెంటరింగ్), నిధులు (ఫండింగ్), సరైన గుర్తింపు లభిస్తాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఒక కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారు. "గతంలో 'ఇంటికి ఒక ఐటీ నిపుణుడు' అనే నినాదం ఇచ్చాను. ఇప్పుడు టెక్నాలజీ మారింది, ప్రపంచం మారింది. అందుకే నేడు 'ఇంటికి ఒక పారిశ్రామికవేత్త' అనే కొత్త పిలుపునిస్తున్నాను. ప్రతి కుటుంబం కలలు కనాలి, వాటిని నిర్మించుకోవాలి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కావాలి" అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం స్టార్టప్‌లను ప్రోత్సహించడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఒక పెద్ద ఉద్యమానికి పునాది వేస్తున్నామని అన్నారు. ఆవిష్కరణలతో పాటు సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచిన గొప్ప దార్శనికుడు రతన్ టాటా స్ఫూర్తితో ఈ హబ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకునేందుకు విచ్చేసిన టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు, ఇతర ప్రముఖులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

## 30 రోజులు కస్టడీలో ఉంటే

## ప్రధాని, సీఎం పదవులు కోల్పోయే కీలక బిల్లు..

మొదటి పేజి తరువాయి



కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు కస్టడీలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. దీనిని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లులను అమిత్ షా సభ ముందు ఉంచారు. ఈ బిల్లులు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులకు వర్తించేలా కొత్త చట్టపరమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని ఆయన అన్నారు. "ఈ బిల్లుతో కార్యనిర్వాహక సంస్థలే న్యాయమూర్తిగా, జ్యూరీగా, శిక్ష అమలు చేసే వారిగా తయారవుతాయి... వాటికి అపరిమిత అధికారాలు లభిస్తాయి. ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయవచ్చు" అని ఒవైసీ తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. "నిరపరాధి అని నిరూపించుకునే వరకు ఎవరైనా నిర్దోషే అనేది మన చట్టబద్ధమైన పాలనలోని ప్రాథమిక సూత్రం. కానీ ఈ బిల్లు ఆ సూత్రాన్నే మార్చేలా ఉంది. ఇది ఒక కార్యనిర్వాహక అధికారిని ప్రధానమంత్రి కంటే ఉన్నత స్థానంలో నిలబెడుతుంది" అని ఆయన లోక్‌సభలో అన్నారు. విపక్ష సభ్యులు నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ బిల్లులను హడావుడిగా తీసుకువచ్చారని ఆరోపించారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. అమిత్ షా స్పందిస్తూ, బిల్లులను హడావుడిగా తీసుకురాలేదని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలిపారు. తాను గుజరాత్ హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టుకు ముందే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశానని అమిత్ షా గుర్తు చేశారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని తెలిపారు. విపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ స్పీకర్ సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర ఉంది!

మూసీ నది ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని ఆయన అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మూసీ నది ప్రక్షాళనతో పాత నగరానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. నగర అభివృద్ధికి అడ్డుపడేవారు ఎవరైనా మనకు శత్రువులేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలతో కూడిన ఉద్యోగ భద్రతను ఇచ్చామని తెలిపారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలని ఆయన ఆకాంక్షించారు.

దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ: రేవంత్ రెడ్డి

రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి అని కొనియాడారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ అమరుడు అయ్యారని రేవంత్ చెప్పుకొచ్చారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో పరిపాలన కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి. ఈ సందర్భంగా తెలంగాణ సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి రేవంత్, కాంగ్రెస్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు



మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ అమరుడయ్యారు. దేశానికి సాంకేతిక నైపుణ్యాన్ని కృషి చేసిన పునాదులు వేసిన నేత రాజీవ్ గాంధీ. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం రాజీవ్ గాంధీ కల్పించారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని అవ్వగానే 21ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ చేసే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడతాం. దేశ కలలు సహకారం కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని అవ్వాల్సిందే. స్థానిక సంస్థల్లో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన నేత రాజీవ్ గాంధీ. సిలికాన్ వ్యాలీని ఈరోజు మహిళలు నడుపుతున్నారు అంటే రాజీవ్ ఘనతే. నేటి యువతకు ఆయన స్ఫూర్తి ప్రదాత. రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణలో పరిపాలన కొనసాగిస్తున్నాం. ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు మన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అలాగే, మూసీ ప్రక్షాళనను మన ప్రభుత్వం చేయబోతోంది అని చెప్పుకొచ్చారు.

# మంత్రి లోకేశ్ చొరవతో ఏపీకి కేంద్రం అధిక ప్రాధాన్యం

అమరరావతి: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో దేశంలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్ది ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ గురించి అందరూ మాట్లాడుకునే విధంగా చేస్తామనే మంత్రి లోకేశ్ సంకల్పానికి కేంద్రం కూడా మద్దతుగా నిలుస్తోంది. సమగ్రశిక్ష ప్రాజక్టుకు గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. దేశానికే ఏపీ విద్యాశాఖ దిక్సూచిగా మారాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష వినూత్నమైన కార్యక్రమాలతో, విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచే విధంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్షకు కేంద్రం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. మంత్రి లోకేశ్ చొరవతో నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మంత్రి లోకేశ్ కృషి కారణంగా సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖకు వరుసగా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు మంజూరయ్యాయి.

ఐసీటీ ల్యాబ్ లు, స్మార్ట్ క్లాసెస్ కు రూ.167.46 కోట్ల అదనపు నిధులు మంజూరు

సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులను బలోపేతం చేయడానికి ఐసీటీ ల్యాబ్ లు, స్మార్ట్ తరగతులు, సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం రూ.167.46 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. దీంతో పాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చడానికి గతంలో 50 శాతం మాత్రమే నిధులు రాగా, ఈ ఏడాది రూ. 45 కోట్లకు గానూ 96



శాతం అంటే రూ. 43.23 కోట్ల నిధులు మంజూరు చేసింది. దశల వారీగా ఇతర డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చేందుకు తగిన నిధులు మంజూరు చేయనుంది.

ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాల కోసం రూ.11 కోట్లు మంజూరు

ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ విద్యార్థుల కోసం 4 వసతి గృహాలను నిర్మించేందుకు కేంద్రం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం అనేది గిరిజన తెగల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం. 2024-25 నుంచి 2028-29 వరకు ఐదేళ్ల కాలానికి ఈ పథకం అమలు చేయనున్నారు. గిరిజన మెజారిటీ గ్రామాలన్నింటిలోనూ సంపూర్ణ అభివృద్ధిని సాధించడం, వారికి మెరుగైన మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం.

జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద రూ.210.5 కోట్లు మంజూరు

ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం లో భాగంగా రెండు దశల్లో మొత్తం 79 హాస్టళ్లు నిర్మించేందుకు కేంద్రం రూ.210.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత ఏడాది నాలుగు హాస్టళ్లు మాత్రమే మంజూరు కాగా.. ఈ ఏడాది అత్యధికంగా 79 హాస్టళ్లు ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి ఈ మేరకు నిధులు కేటాయించింది.

మంత్రి లోకేశ్ చొరవతో పీఎంశ్రీ కింద అదనంగా 80 పాఠశాలలు ఎంపిక

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథక కింద రాష్ట్రంలో ఈ ఏడాదికి మొత్తం 80 పాఠశాలలను కేంద్రం ఎంపిక చేసింది. వీటికి ఇంకా నిధులు కేటాయించాల్సి ఉంది. రాష్ట్రంలో మొదటి దశలో 662 పీఎంశ్రీ పాఠశాలలు, రెండో దశలో 193 కలిపి మొత్తం 855 పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేయగా.. మంత్రి నారా లోకేశ్ చొరవతో ఈ విద్యా సంవత్సరం అదనంగా మరో 80 పీఎంశ్రీ పాఠశాలలను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా 14,500 పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా.. అత్యధికంగా ఏపీకే 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించడం జరిగింది. మొత్తం మీద మంత్రి లోకేశ్ కృషి కారణంగా సమగ్రశిక్ష కింద రాష్ట్రానికి అదనంగా రూ.432.19 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

## 'ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రుల

## తొలగింపు బిల్లు' పై ప్రతిపక్షాల ఫైర్

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ప్రధాని, సీఎంలు, మంత్రుల తొలగింపు బిల్లు'పై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల నుంచి అధికారాన్ని లాక్కునేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు చేస్తున్న కుట్ర అని ఆరోపించాయి. దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, నియంతృత్వం వైపు నడిపిస్తోందంటూ బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ బిల్లు చట్టంగా మారితే ప్రతిపక్షాలకు చెందిన సీఎంలను పదవి నుంచి దింపేయడం కేంద్రానికి సులభమవుతుందని పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఆమె ఆరోపించారు. రాజకీయ నేతల అవినీతిని అడ్డుకునేందుకే ఈ బిల్లు తెచ్చామంటూ బీజేపీ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. ప్రతిపాదిత బిల్లు చట్టంగా మారితే.. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిపై తప్పుడు కేసుతో 30 రోజులకు పైగా జైలులో పెట్టి బీజేపీ అధికారాన్ని లాక్కుంటుందని ప్రియాంక ఆరోపించారు. బిల్లు అప్రజాస్వామికమని, దురదృష్టకరమని ఆమె అన్నారు.

## 17వ రోజుకు చేరుకున్న సినీ కార్మికుల సమ్మె...

## సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

హైదరాబాద్: గత 17 రోజులుగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మె వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. సమ్మె కారణంగా తెలుగుతో పాటు ఇతర భాషల సినిమా షూటింగులు కూడా నిలిచిపోవడంతో ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జోక్యంతో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. హైదరాబాద్‌ను దేశంలోనే ప్రధాన సినిమా హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ సమ్మె అడ్డంకిగా మారిందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర సినిమా పాలసీపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో ఒక విడత చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా, ఈరోజు ఫెడరేషన్ నాయకులతో కూడా సమావేశం కానున్నారు. డీజీపీ సైతం ఫెడరేషన్ నేతలతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో ముగుస్తున్న వైన్ షాపుల లైసెన్సులు..

హైదరాబాద్: తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్సులకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వైన్ షాపులకు జనాభాను ప్రామాణికంగా తీసుకుని కొత్త లైసెన్స్ ఫీజులను ఖరారు చేసింది. ప్రస్తుత లైసెన్సుల గడువు ఈ ఏడాది నవంబర్ 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుల ఫీజును రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు రెండేళ్ల కోసం లైసెన్సులు జారీ చేయనున్నట్లు పేర్కొంది. మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు కూడా కల్పించింది. గౌడ్ లకు 15 శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తించే ఈ కొత్త విధానం ప్రకారం, జనాభాను బట్టి ఫీజులను పలు స్లాబులుగా విభజించారు.

అబ్కారీ శాఖ నిర్ణయించిన వివరాల ప్రకారం:

5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజును రూ. 50 లక్షలుగా నిర్ణయించారు. 5 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ. 55 లక్షలు చెల్లించాలి. 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న చోట ఫీజు రూ. 60 లక్షలుగా ఉంది. లక్ష నుంచి 5 లక్షల జనాభా వరకు రూ. 65 లక్షలు ఖరారు చేశారు. 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలు, పట్టణాల్లో అత్యధికంగా రూ. 1 కోటి 10 లక్షల లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. ప్రస్తుత లైసెన్సుల గడువు ముగియనుండటంతో, రాబోయే విడతకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కోసం అబ్కారీ శాఖ ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించింది.

## పిఠాపురం మహిళలకు

## పవన్ కల్యాణ్ శ్రావణ శుక్రవారం కానుక

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ మహిళలకు శ్రావణమాస కానుకను ప్రకటించారు. శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని, 10 వేల మంది మహిళలకు చీరలతో పాటు పసుపు, కుంకుమలను అందించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీన పిఠాపురంలోని ప్రసిద్ధ శ్రీ పాదగయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్కడి ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరపనున్నారు. ఈ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు ఈ కానుకలను అందజేయనున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు, రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. ప్రతి విడతకూ అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరి అని అమ్మవార్ల పేర్లతో నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే మహిళల కోసం గురువారం నుంచే కూపన్ల పంపిణీ ప్రారంభం కానుంది. ప్రతి కూపన్‌పై నిర్దిష్ట సమయాన్ని ముద్రిస్తారు. మహిళలు తమకు కేటాయించిన సమయానికి ఆలయానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత వచ్చే మహిళలకు కూడా కానుకలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమాన్ని దేవాలయ సిబ్బంది, పోలీసులు, జనసేన వాలంటీర్లు సమన్వయంతో పర్యవేక్షించనున్నారు.

## లోక్‌సభలో 'ఆన్‌లైన్ గేమింగ్' రగడ..

## ప్రతిపక్షాల ఆందోళనతో దద్దరిల్లిన సభ!

ఢిల్లీ: లోక్‌సభ బుధవారం తీవ్ర గందరగోళం మధ్య ప్రారంభమైంది. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుపై రగడ చెలరేగింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్, నియంత్రణ బిల్లు 2025'ను సభలో ప్రవేశపెట్టగానే ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసనలకు దిగారు. వారి ఆందోళనలతో సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

ప్రతిపక్షాల తీరుపై మంత్రి రిజిజు ఆగ్రహం

సభలో ప్రతిపక్షాల తీరుపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యుల ప్రవర్తనను చూసి పాఠశాల పిల్లలు కూడా ప్రశ్నించే పరిస్థితి ఏర్పడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. "అంతరిక్ష రంగంలో మనం సాధించిన విజయాలపై చర్చించేందుకు కూడా వారు అనుమతించడం లేదు. ప్రజలంతా గమనిస్తున్నారు" అంటూ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

బిల్లులోని ముఖ్యాంశాలు ఏమిటంటే..?

ఈ-స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమింగ్‌తో సహా మొత్తం ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చి నియంత్రించేందుకు ఈ బిల్లును రూపొందించారు. దీని కోసం జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి లేదా విదేశాల నుంచి నిర్వహించే డబ్బుతో కూడిన ఆన్‌లైన్ గేమ్‌లను పూర్తిగా నిషేధించాలని ఈ బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల యువత వ్యసనాలకు బానిస కావడం, మోసాలు, వ్యక్తిగత డేటా ఉల్లంఘనలు వంటి సమస్యలను అరికట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక వ్యవస్థ, జాతీయ సార్వభౌమత్వ పరిరక్షణ కూడా ఈ బిల్లు ఉద్దేశాలలో ఒకటి.

## యూఎస్ మార్కెట్‌లో కష్టాలా? రండి..

## మేం ఉన్నాం: భారత్‌కు రష్యా భరోసా




ఢిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా ఆంక్షల ఒత్తిడి పెంచుతున్న వేళ, రష్యా కీలక ప్రకటన చేసింది. ఒకవేళ అమెరికా మార్కెట్‌లో భారత వస్తువులకు ఇబ్బందులు ఎదురైతే, తమ దేశ మార్కెట్ తలుపులు తెరిచే ఉంటాయని స్పష్టం చేసింది. భారత ఉత్పత్తులకు తాము స్వాగతం పలుకుతామని బంపర్ ఆఫర్ ఇచ్చింది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా అనుసరిస్తున్న వైఖరి ఏకపక్షమని, అన్యాయమని తీవ్రంగా విమర్శించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో రష్యా డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ రోమన్ బాబుష్కిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారతీయ వస్తువులు అమెరికా మార్కెట్లోకి ప్రవేశించడానికి ఇబ్బందులు పడుతుంటే, రష్యా మార్కెట్ వాటిని స్వాగతించడానికి సిద్ధంగా ఉంది. ఆంక్షలు విధించే వారికే అవి నష్టం కలిగిస్తాయి. ఇది భారత్‌కు సవాలుతో కూడిన పరిస్థితి అయినప్పటికీ, మా సంబంధాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన తెలిపారు. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్-రష్యా ఇంధన సహకారం కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై ఒత్తిడి పెంచేందుకు, ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఆగస్టు 27 నుంచి 25 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో రష్యా అధికారి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్‌కు రష్యానే అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు అని, భారత్ ఇంధన అవసరాలు ఏటా పెరుగుతున్నాయని బాబుష్కిన్ గుర్తుచేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్, రష్యా బంధం వ్యూహాత్మకంగా కొనసాగుతోందని ఆయన అన్నారు. "పశ్చిమ దేశాలు మిమ్మల్ని విమర్శిస్తున్నాయంటే, మీరు సరైన మార్గంలోనే వెళుతున్నారని అర్థం. వారు తమ సొంత ప్రయోజనాల కోసమే చూసుకునే నయా వలసవాద శక్తుల్లా ప్రవర్తిస్తారు. స్నేహితులు ఇలా ప్రవర్తించరు" అంటూ అమెరికా తీరుపై ఆయన పరోక్షంగా చురకలు అంటించారు. ఇటీవలే రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీకి ఫోన్ చేసి ఉక్రెయిన్ పరిణామాలను వివరించారని, దీన్ని బట్టే రష్యాకు భారత్ ఎంత ముఖ్యమో అర్థమవుతుందని చెప్పారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

## పార్టీకి కష్టపడిన వారిని ఎప్పటికీ మరిచిపోము సోమేశ్వర స్వామి ఆలయం చైర్మన్ గా బూర్లె



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: పార్టీకి కష్టపడి వెన్నుదన్నుగా ఉండే నాయకులకి ఎప్పటికైనా పదవి వరిస్తుందని ఉదాహరణ గా బాపట్ల పట్టణంలోని శ్రీ గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి ( పెద్ద శివాలయం) చైర్మన్ గా బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, బాపట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, రోటరీ క్లబ్ బాపట్ల సీనియర్ సభ్యులు బూర్లె రామ సుబ్బారావు,తన ఈ పదవి నియామకానికి కృషిచేసిన బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు కి ఈ సందర్భంగా రామ సుబ్బారావు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## నానో యూరియా వాడండి వ్యవసాయాన్ని సులభతరం చేసుకోండి ఏవో స్వప్నిక రెడ్డి






నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): గోస్పాడు మండలం పసురుపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి మాట్లాడుతూ రైతులు నానో యూరియా వాడాలని, నానో యూరియా వాడుట ద్వారా పంటకు 80% నత్రజని అందుతుందని, దీనిని పంటపై నేరుగా పిచికారి చేస్తాం కాబట్టి పంట యొక్క అన్ని భాగాలకు ఇది సులభంగా చేరుతుందని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చునని, ఖర్చు కూడా తగ్గుతుందని రైతులకు తెలియజేశారు.అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ ఉన్న రైతులు వెంటనే సంబంధిత రైతు సేవ కేంద్రాలలో గ్రీవెన్స్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఎన్పీసీఐ మ్యాపింగ్ చేసుకోని రైతులు వెంటనే బ్యాంకుకు వెళ్లి చేయించుకుంటే వారికి కూడా అన్నదాత సుఖీభవ డబ్బులు అకౌంట్ లో జమ అవుతాయని తెలిపారు. కౌలుకు తీసుకున్న రైతులు వెంటనే కౌలు కార్డులు తీసుకోవాలని, రైతులు తాము వేసిన పంటలను వెంటనే పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఏఈఓ రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు



నల్లచెరువు,ఆగస్ట్ 20 (శుభోదయం న్యూస్) : మండల కేంద్రం నల్లచెరువులో పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు చెట్లు కొమ్మలు విద్యుత్ స్తంభాల పైకి విస్తరించి వాటి కలపలతో పాటు తీగలు స్తంభాలపై అల్లుకుపోతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.అయితే ఇవి ప్రజల జీవన భద్రతపై తీవ్రమైన ప్రభావంగా మారే అవకాశంగా కనిపిస్తున్నాయి.వానకాలం రాగానే ఈ సమస్య మరింత తీవ్రతరమవుతోంది.చెట్ల కొమ్మలు తడిసి విద్యుత్ తీగలపాకు తాగితే షార్ట్ సర్క్యూట్లు జరిగి విద్యుత్ అంతరాయాలుకు కారణమవుతున్నాయి. గాలి వాన వీచినప్పుడు ఒకదానికి ఒకటి అల్లుకున్న తీగల కారణంగా ట్రాన్స్ఫార్మర్ల వద్ద నిప్పురవ్వలు చెలరేగుతుండటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు.మండలంలో వీటి ఆలనా పాలన పట్టించుకునే విద్యుత్ అధికారులు కరువయ్యారు.మరికొన్ని చోట్ల స్తంభాలకు కంచలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మండల కేంద్రంలోని బుజ్జి గంగమ్మ ఆలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి కింద నుండి పైవరకు మొత్తం చెట్లు అల్లుకున్నాయి.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుజ్జి గంగమ్మ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్, జెండా వేపమాన సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన విద్యుత్ నియంత్రికల చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.గతంలో పూలకుంట రోడ్డులో గల విద్యుత్ నియంత్రిక తగిలి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటనలు కూడా లేకపోలేదు.అయితే అప్పటికప్పుడు స్పందించిన అధికారులు మండల వ్యాప్తంగా ఆ ఒక్క ట్రాన్స్ఫార్మర్ కు మాత్రమే కంచ ఏర్పాటు చేసి ససేనిరా అని చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు మండల వ్యాప్తంగా వెలివెత్తుతున్నాయి. ప్రాణం పోతే తప్ప అధికారులు స్పందించడం లేదని మండల వ్యాప్తంగా విద్యుత్ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి కింద నుండి పై వరకు చెట్ల తీగలు అల్లుకున్నాయి. చిన్న చినుకు పడితే ఈ ప్రాంతం మొత్తం చెరువుగా మారి ఆ నీరు మొత్తం ఆ స్తంభం కింద నుండే వెళ్తాయి. పొరపాటున నీటిలో తడిచి విద్యుత్ సరఫరా అయితే పరిస్థితి ఏంటని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

## వరద ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా ఎస్పీ - ప్రతాప్ శివ కిషోర్ గోదావరి వరదలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - ఎస్పీ సూచన





పోలవరం ప్రతినిధి, (శుభోదయం న్యూస్): వేలేరుపాడు మండలంలో ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలు అయిన రేపకగొమ్ము గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులు దాటి ప్రవహిస్తు ఒదన్నారు. ఇప్పటికే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలను సూచించారు. అదేవిధంగా పశువులను కూడా ముందస్తుగా గ్రామం నుండి తరలించుకోవాలని తెలిపారు. అనంతరం వేలేరుపాడు రుద్రంకోట గ్రామాల మధ్య ఉన్న, బ్రిడ్జి వద్ద గోదావరి అధికారులతో స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎవ్వరిని గోదావరి వద్దకు వెళ్లకుండా బారి గేట్లు ఏర్పాటు చేశారన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం బ్రిడ్జి వద్ద అధికారులు లాంచీని ఏర్పాటు చేశారన్నారు. ఈ పర్యటనలో పోలవరం డి ఎస్పీ వెంకటేశ్వరావు, కుక్కునూరు సీఐ రమేష్ బాబు, వేలేరుపాడు ఎస్సై నవీన్ కుమార్, జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది, వేలేరుపాడు జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

## త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్



జంగారెడ్డి గూడెం డివిజన్ ఇంచార్జ్ ఆగస్టు 20(శుభోదయం న్యూస్): రైతులకు వెన్నెముక వంటి సహకార రంగాన్ని సజావుగా వినియోగించుకుంటే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని స్థానిక ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పేర్కొన్నారు.ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘం(ప్యాక్స్ ) వ్యవస్థ ఎంతో పురాతనమైనదని వాణిజ్య బ్యాంకింగ్ విధానం వేరని ఇది సంఘ సభ్యుల సంక్షేమం కోసం నిర్వహించే సంస్థ అని ఆయన వివరించారు.స్థానిక పిఏ సి ఎస్ నూతన పాలక వర్గం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఇక్కడి సొసైటీ కార్యాలయం వద్ద జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమక్షంలోఅధ్యక్షుడుగా మాని కల నాగేశ్వరావు, సభ్యులు పాతూరి అంబేద్కర్, కొంచాడ దుర్గాప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ ప్రసంగిస్తూ రైతుల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా వ్యవహ రించాలిని నూతన త్రిసభ్య కమిటీ కి సూచించారు.అవకాశం అవసరం ఉన్న చోట పెట్రోల్ బంకులు, గోడవున్లు ఇతర వ్యాపార అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని హితవుచెప్పారు.సభ్యులు అందరినీ యాక్టివ్ చెయ్యాలని నష్టాల్లో ఉన్న సంఘాన్ని గాడి లో పెట్టాలని కోరారు. రెండు వారాల్లో నియోజకవర్గం లోని అన్ని సహకార సంఘాలు, కార్యాదర్శులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని అప్పటి కి మీ యాక్షన్ ప్లాన్ తో సిద్ధంగా ఉండాలని కోరారు. నియోజకవర్గం లో బిసి లకు అధికప్రాధాన్యత ఇచ్చి ఎక్కువ సొసైటీ పదవులు ఇచ్చినట్లు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమల్లో సూపర్ హిట్ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు సజావుగా అమలవు తున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ లో భాగమైన స్త్రీ శక్తి బ్రహ్మాండంగా అమలౌవు తుందనితెలిపారు.74%ఓ ఆర్ తో బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. రూ 19,వేల కోట్లు ఖర్చు తో ఆరు వేలకు పైగా బస్సులు ఏపీటిడిసి నడుపుతోందని వివరించారు. రానున్న రోజుల్లో మహిళలు మరింత శక్తీ వంతులై సొంత కార్లలో రావాలని ముఖ్య మంత్రి చంద్రబాబు కూటమి పెద్దల ఆశ అన్నారు.అలాగే రైతుభరోసా ద్వారా కేంద్రం, రాష్ట్రప్రభుత్వం రూ 7,వేలు ఇస్తున్నారని మిగతా విడత త్వరలో విడుదల అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం లో భాగంగా సొసైటీ నూతన అధ్యక్షుడు నాగేశ్వరావు మాట్లాడుతూ తమకు దక్కిన ఈ చాన్స్ ను సద్వినియోగం చేసుకుని రైతులకు మేలు చేస్తామనివాగ్దానం చేశారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు కొండ్రెడ్డి కృష్ణ కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో మాజీ సొసైటీ అధ్యక్షుడు పరిమి సత్తి పండు, సీనియర్ నాయకులు మండవలక్ష్మణ రావు, రాజాన సత్యన్నారాయణ, దాసరి శేషు, సి హెచ్ రామలింగేశ్వర రావు,బీజేపీ నాయకుడు కొప్పాక్రశీనివాసరావు తదితరులు మాట్లాడారు.పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం




ఏలూరు జిల్లా ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్ ) : ఏలూరు జిల్లా చింతలపూడి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వారి ఆదేశానుసారం హెల్త్ ఇన్నెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ది. .20/8/2025 న జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వైద్య సిబ్బంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి కి రావడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశంలో క్షయవ్యాధి (ట్యూబర్క్యూలోసిస్ %-% టీబీ ) ఇంకా ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగానే కొనసాగుతోంది. ఈ సమస్యను నిర్మూలించేందుకు..ప్రభుత్వం "జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం.ను ప్రభుత్వం వైద్య సహాయ బృందంతో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తుందని ప్రశంసించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్. జె .కె నరేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవగాహన సదస్సులో క్షయ వ్యాధి గురించి తెలుసుకొని మీ చుట్టుపక్కల ప్రాంతాల వారికి క్షయ వ్యాధి నివారణ విషయాలు అందించినట్లయితే ఎవరు క్షయ వ్యాధి కి గురవురని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రభాకర్ ఎం.పి .హెచ్ .ఎస్ మాట్లాడుతూ 2025 నాటికి భారత్లో టీబీ.నిర్మూలన (%ఔనూ%) నిర్దేశించిన 2030 లక్ష్యానికంటే ఐదు సంవత్సరాలు ముందే). క్షయ రోగులందరికీ ఉచిత నిర్ధారణ, చికిత్స,ఔషధాలుఅందించడం.మైక్రోస్కోపీ, జీనెక్స్పర్ట్, కల్చర్ సౌకర్యాలు విస్తరించడం. రోగులకు పోషణ మద్దతు (నిక్షయ్ పోషణ యోజన 1000 ప్రతి నెలకు) అందించడం. అని వివరించారు. కే .దిలీప్ కుమార్ హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం భారతదేశ ఆరోగ్యరంగంలో కీలకమైన పథకం. "టీబీ హారేగా దిష్ జీటేగా " అనే నినాదంతో, ప్రభుత్వం 2025 నాటికి దేశాన్ని క్షయముక్త భారత్గా మార్చాలని సంకల్పించింద నీ వివరించారు. విద్యార్థులతో క్షయ వ్యాధి నివారణ నినాదాలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విజయ్ ఎస్ టి ఎస్, బి శ్యామల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలి డాక్టర్ టి చెన్న కృష్ణ




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : జనవిజ్ఞాన వేదిక పామూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శాస్త్ర దృక్పథా దినోత్సవం ఆదిత్య జూనియర్ కళాశాల నందు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ టి చెన్న కృష్ణ గారు మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుండే శాస్త్రీయ ఆలోచన విధానం అలవర్చుకోవాలని తమ జీవితంలో రోజువారి కార్యకలాపాలలో సైన్స్ దాగి ఉందని తమ తినే పదార్థాలను ఉన్న కల్తీ ని విద్యార్థులకు తెలియజేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ప్రతి విషయంలో ఎందుకు ఏమిటి ఎలా అనే ప్రశ్నల ద్వారా ముందుకు నడవాలని తమ కుటుంబంలో మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించాలని తమ చదివే సైన్స్ నిత్యజీవితంలో ప్రాక్టికల్ పద్ధతిలో ఉపయోగించుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు శంకర్ గారు మాట్లాడుతూ నరేంద్ర దబాల్కర్ గారి వర్ధంతిని గుర్తు చేసుకుంటూ మహారాష్ట్రలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు ఈ తరహాలో అన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని తీసుకురావాలని కోరారు విద్యార్థులలో మరియు గ్రామాలలో ఉన్న మూఢనమ్మకాల గురించి వాటి వెనకాల ఉన్న సైన్స్

## పొలం పిలుస్తుంది కార్యక్రమం




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :20.08.2025 న దోర్నాల మండలం లోని ఎగువ చెర్లోపల్లి మరియు చిలకచర్ల గ్రామం



లో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామం లో సాగు చేసిన టమాటో మరియు వంకాయ పంటలను సందర్శించి పంట లలో సస్య రక్షణ చెర్యలు గురించి తెలియజేసారు. అలాగే పొగాకు పంటకు ప్రత్యేమ్నాయ పంటలైన మొక్కజొన్న, మినుము, కంది, అలసంద పంటలు సాగు చేయాలనీ, అలాగే ప్రకృతి వ్యవసాయ ద్వారా పంటలు పండించ లని తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు శివ నాయక్, సిబ్బంది ఆనందరావు, రైతులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠం ఆలయ పిట్ పర్సన్ శంకర్ బాలాజీని నియామకాన్ని రద్దు చేసిన హైకోర్టు



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నందు ఫిట్ పర్సన్ గా శంకర బాలాజీ నియామకాన్ని 7.8.2025న గౌరవ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు రద్దు చేసిందనీ, ఆ రోజు నుంచి ఆ తీర్పు అమలులోకి వచ్చినట్టేననీ, నిన్న 19.8.2025 న ఫైనల్ ఆర్డర్ కాపీ కూడా వచ్చినదనీ పూర్వపు మఠాధిపతుల ధర్మపత్ని శ్రీమతి మారుతి మహాలక్ష్మి పత్రికా ప్రతినిధుల సమావేశంలో చెప్పారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 26 ప్రకారం మఠం స్వయం ప్రతి పత్తి గల ధార్మిక సంస్థనీ, అలాంటి సంస్థలలో ప్రభుత్వ అధికారిని నియమించే అధికారం ధార్మిక పరిషత్ కి లేదని, మేము మొదటి నుంచి చెప్తున్నామని, దానికి సమర్థనగా సుప్రీంకోర్టు జడ్జిమెంట్ లను చూపి మా లాయర్ గారు వాదనలు వినిపించగా, ఆ వాదనతో గౌరవ హైకోర్టు ఏకీభవించి ఫిట్ పర్సన్ నియామకం రద్దు చేసినదనీ మారుతి మహాలక్ష్మి చెప్పారు మఠాధిపతి నియామకం 6 వారాలలో డివిజన్ బెంచ్ తీర్పు ప్రకారం చేయాలని కమీషనర్ గారికి కోర్టు చెప్పినదనీ, అలానే అప్పటి వరకు కమీషనర్ గారి పర్యవేక్షణలో మఠం ఉంటుందని కోర్టు చెప్పినట్టుగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇలా కక్షపూరితంగా రాజ్యాంగ వ్యతిరేకంగా జరిగిన నియామకంను కోర్టు రద్దు చేయడం పట్ల ఆవిడ హర్షం వ్యక్తం చేస్తూ, గౌరవ ముఖ్యమంత్రి గతంలో జరిగిన తప్పిదాలను, పరిశీలన చేసి మాకు తగిన న్యాయం చేయాలని వారికి పత్రికా ముఖంగా విన్నవించారు. మారుతి మహాలక్ష్మి

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): కడప జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా కడప పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు చాపాటి సాయి నారాయణరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేయించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి , విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివ, విష్ణు, హరి తదితరులు పాల్గొన్నారు. జన్మదినం సందర్భంగా నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేశారు మరియు ఆయన నాయకత్వం కడప జిల్లాలో మరింత అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



బ్రహ్మంగారిమఠం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ) : బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని రేకులకుంట పంచాయతీ వాంపల్లి చెరువు గ్రామంలోని విద్యుత్ సమస్యల వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మరియు టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లి కార్జున రెడ్డి ఎమ్మెల్యే దృష్టి కి తీసుకెళ్లగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తక్షణమే విద్యుత్ సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తమ గ్రామంలోని విద్యుత్ సమస్యను పరిష్కరించడంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారికి గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, పుటాల శివాయాదవ్, నాగిపోగు సుధాకర్, కోడూరు రాజు, కోడూరు సుధాకర్, తధితరులు పాల్గొనడం జరిగింది.

## 2003 డిఎస్సీ ఉపాధ్యాయుల విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చెయ్యండి యుటిఎఫ్




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): 2003 డీస్సీ వారికి కేంద్ర ప్రభుత్వం మాదిరిగా 57 మెమో ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,2003 డీస్సీ ఫోరమ్ వారు యుటిఎఫ్ ఆఫీస్ లో జిల్లా నాయకత్వాన్ని కోరారు. యుటిఎఫ్ తరపున 25 తేదీ విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.వి.ప్రసాద్, కార్యదర్శులు అరవింద్,ఖాసీం,జాన్సన్,వేంకటేష్,సుకుమార్ మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలపై జరదృష్టి సారించండి సారూ



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: గత 25 సంవత్సరాలుగా 75 రూపాయలు పెన్షన్ ఉన్నప్పటినుండి పెన్షన్లుతీసుకుంటున్నామని, వికలాంగులమైనతాము ఏపని చేసుకోలేక, ఇతరులపైఆధారపడి జీవించలేక, ప్రభుత్వంఇచ్చేపెన్షన్ పై ఆధారపడిజీవిస్తున్నామని, ఉన్నపళంగాపెన్షన్లుతొలగిస్తే తమకుటుంబాలురోడ్డున పడతాయని, పాలకులు, ప్రభుత్వ అధికారులుతమపై కూసింత కనికరంచూపి, తమపెన్షన్లను పునరుద్దించాలని బోగోలు మండలంలోనివికలాంగులు బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రంసమర్పించారు. ఈవిషయమైవిచారించగా బోగోలుమండలంలో 126 మంది వికలాంగులపెన్షన్లు ఈనెలలో నిలిచిపోయినట్లు, వాటిలో30 వరకుసరిచేయగా ఇంకా 96 మందిపెన్షన్లను సరిచేయవలసి ఉన్నట్లుతెలిసింది. ఈవిషయమై అధికారులు వివరణఇస్తూ గతప్రభుత్వంహయాంలో అనర్హులైనకొందరు వికలాంగుల పెన్షన్లుతీసుకుంటుండగా,వాటిని సరిచేసేక్రమంలో కొన్నిపెన్షన్లు నిలిచిపోయాయని, పెన్షన్లు నిలిచిపోయినవారందరూ తిరిగి దరఖాస్తుచేసుకుంటే ఎంపీడీవో లాగిన్ ద్వారాఉన్నతాధికారులకు సమాచారంఇచ్చి ఒకప్రత్యేక సదరన్ క్యాంప్ నిర్వహించి అర్హులైనవారికి పెన్షన్లుమంజూరు చేయడంజరుగుతుందని తెలిపారు. ఏదిఏమైనాప్పటికీ కూటమిప్రభుత్వం ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై కొంతైనాదృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనాఉంది. పైకార్యక్రమంలోప్యాట్రిక్,తిరుపతి,అబ్బులుతదిటరులుపాల్గొన్నారు.

# డిప్యూటీ తహసీల్దార్ కు వినతి



నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, ఆగస్ట్ 20 (శుభోదయం న్యూస్) : మండలంలోని ఒరవాయి గ్రామానికి చెందిన చిన్న రెడ్డప్ప అనే రైతు వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న రంగస్వామి మా దాయాదులు కావడంతోనే వీఆర్ఓ మా భూమిని ఆన్లైన్లో ఎక్కించిన మాట వాస్తవమేనని బాధితుడు చిన్నా రేడ్డప్ప పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక తాహాసిల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసిల్దార్ రవికుమార్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు.బాధితుడు చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ మా తండ్రి సంతానము కదిరప్ప,గంగప్ప,ముత్తన్న అనే వారున్నారు.తాము ముత్తన్న వంశానికి చెందినవారమన్నారు.కదిరప్ప వంశానికి చెందినవారు వీఆర్ఏ రంగస్వామి అని తెలిపారు.వీఆర్ఏ రంగస్వామి మా దాయాదులు ఎవరికి తెలియకుండా భూమి ఆన్లైన్ ఎక్కించుకొని ఈ పాస్ పుస్తకమును చేయించుకున్నారన్నారు.దీనిపై గత ఆరేళ్లుగా రెవిన్యూ కార్యాలయాలు,కలెక్టర్ కార్యాలయాలకు తిరిగి వినతి పత్రాలు సమర్పించామన్నారు.ఈ భూ వివాదమై ఎన్నోసార్లు రెవిన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.అంతేకాకుండా పెద్దమనుషుల సమక్షంలో వీఆర్ఏ రంగయ్యకు కూడా ఈ విషయాన్ని తెలియజేశారని తెలిపారు.రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాతే విఆర్వో నిర్మల మా వద్ద ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే,న్యాయపరంగా, చట్టపరంగా సాగు హక్కు ప్రకారం సమానంగా మాకు,మా దాయాదులకు ఆస్తిని ఎక్కించారని తెలిపారు.చట్టబద్ధంగా విధులు నిర్వహించిన విఆర్వో నిర్మలపై పలు రెవిన్యూ సిబ్బందిపై లంచాలు తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు.వీఆర్ఏ రంగస్వామి పురుగుల మందు సేవించి వీఆర్వో నిర్మల లంచం తీసుకొని మా భూమిని మా దాయాదులకు ఎక్కించారని చేసిన వాదనలు అవాస్తమన్నారు.మా తాతల నుంచి వస్తున్న ఆస్తిని రెవెన్యూ రికార్డుల ప్రకారమే పంపిణీ చేయాలని డిప్యూటీ తహసిల్దార్ రవికుమార్ నాయక్ ను కోరారు.

## డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుదాం
## జేసీ పిలుపు మత్తు పదార్థలు సరఫరా చేస్తే కఠిన చర్యలు



(శుభోదయం న్యూస్) బాపట్ల : జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ, నివారణ చర్యలపై సమన్వయం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మత్తు పదార్థాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ జీ. గంగాధర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడం అందరి ప్రధాన బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి శాఖ ఒకే దిశలో కృషి చేస్తేనే ఫలితం వస్తుందని, పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, సోషల్ వెల్ఫేర్ వంటి విభాగాలు కూడా చురుకుగా పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్కూల్-కాలేజీల్లో జాగృతి సదస్సులు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు ఎస్పీ బి. ఫణిరాజు శర్మ మాట్లాడుతూ,డ్రగ్స్ వ్యాప్తి యువత జీవితాలను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైన్లు, బస్ స్టాండ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, గంజాయి తరలింపు, సరఫరాపై కఠిన నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే వలసలపై కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్లోరియ, చంద్రశేఖర్, రామలక్ష్మి, మేజిస్ట్రీరియల్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఇతర అధికారులు ఎన్జీవోలు పాల్గొన్నారు.

## విప్లవకారుడు నారాయణ గురు జయంతి వేడుకలు
## జై గౌడ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షులు చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్




(శుభోదయం న్యూస్) : గుంటూరు జిల్లా తెనాలి సామాజిక గురువు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గుడికంటే బడిమేలని ప్రభోధించిన సామాజిక విప్లవకారుడు నారాయణగురు 171 వ జయంతి సందర్భంగా జై గౌడ్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున ఘనమైన నివాళులు అర్పిస్తున్నాము..

## కోబాకు సుబ్రహ్మణ్యం,శాంతి ల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నం వాసుదేవ నాయుడు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): పట్టణంలోని 1వ వార్డు వి.యం.పల్లి కి చెందిన కోబాకు.సుబ్రమణ్యం మరియు శాంతి ల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు.తారక శ్రీనివాసులు, తిరుపతి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం.వాసుదేవ నాయుడు,మండల ఎంపీపీ నిర్మలమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం జ్ఞాపికను అందించి దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పసల రమణయ్య, పసల కుమారస్వామి,శ్రీవారి సురేష్, బుల్లెట్ జయశ్యామ్,పసల కృష్ణయ్య, పసల సురేష్,రామచంద్రయ్య, కమలాకర్,మధు తదితరులు పాల్గొన్నారు.



## తలుపులు విరగ్గొట్టి..బీగాలు పగలగొట్టి టీ దుకాణంలో చోరీకి యత్నం
## వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): పట్టణంలోని వన్ టౌన్ పరిధిలోని శ్రీకాళహస్తి సబ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న టీ దుకాణం లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టీ దుకాణం తలుపు విరగ్గొట్టి, బీగాలు పగలగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. పసుపులేటి మునస్వామి కుటుంబం రిజిస్ట్రార్ ఆఫీస్ టి దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదే షాపులో అతని కోడలు జెరాక్స్ సెంటర్, కుమారుడు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు షాపు నడుపుకుని ఇంటికి వెళ్లారు. ఉదయం 9.30గంటలకు షాపుకు వచ్చి చూడగా తలుపు విరగ్గొట్టి, బీగాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి వన్ టౌన్ పోలీబులకు ఫిర్యాదు చేశారు. బీగాలు పూర్తిగా పగిలినట్లయితే నాలుగు కంప్యూటర్ లు ,ఇతరత్రా సామగ్రి చోరీకి గురయ్యేవి. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని మునస్వామి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



# చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



చీరాల, (శుభోదయం న్యూస్): చీరాల ఎన్ఆర్పియం హై స్కూల్ నందు వాకర్స్ అసోసియేషన్ వారితో చీరాల జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ డాక్టర్ దేవరాజు అసోసియేషన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో చీరాల జిల్లా కేంద్ర యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, బాపట్ల జిల్లాను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జిల్లాగా పేరు మార్చాలని అదేవిధంగా చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల అందరి సపోర్ట్ కావాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సురేష్ ,ప్రసాద్, మురళి, శ్రీరామ్ మాట్లాడుతూ చీరాల ను జిల్లా కేంద్రం చేయాలని అదేవిధంగా ఆంధ్ర గోపాలకృష్ణ గారి పేరు పెట్టాలని, మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ఆగస్టు 29వ తారీఖున బాపట్ల కలెక్టర్ ఆఫీస్ నందు అర్జీలు స్వీకరించడానికి జిల్లాల పునర్విభజన మంత్రుల సంఘం రానున్నది కావున చీరాలను జిల్లా కేంద్రంగా చేస్తూ బాపట్ల జిల్లాకు ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలి అనేటటువంటి నినాదంతో చీరాలలో ఉండేటువంటి అన్ని రాజకీయ పార్టీలు మరియు వ్యాపార సంఘాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ సంఘాలు మరియు వివిధ రకాల సంఘల నాయకులందరూ కలిసి వచ్చి 29వ తారీఖున కలెక్టర్ ఆఫీసులో చీరాల ఆకాంక్షను అర్జీల రూపంలో తెలియ పరచవలసినగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్,గ్రంథి నారాయణమూర్తి, దోగుపర్తి వెంకట సురేష్, వలివేటి మురళీకృష్ణ, శీరాం రమేష్, గుద్దంటి రమేష్ బాబు, ఏ.నాగ వీరభద్రాచారి,వీరాంజనేయులు, చింతా రమేష్,శ్రీనివాసరావు,చింతా అప్పారావు, వెంకట రమణారావు, దేగల తిరుపతి రావు, మామిడాల శ్రీనివాస్ , సుభాషిణి,అమర ఆంజనేయులు, గుర్రం బదరీనాథ్, కేవి .సుబ్బా రావు, చింతా రమేష్ ,భాస్కర్, సాయి, వంగర పూర్ణ చంద్ర రావు, గోదావర్తి సుధాకర రావు,చీమకుర్తి మధుసూదన రావు, కొప్పుల వాసు బాబు , చలపతి రావు, పులిమి శ్రీ కృష్ణ ప్రసాద్ , పచ్చి పులుసు జగన్ మోహన్ రావు ,శ్రీరామ చంగల రాయుడు, కూనాగు బ్రహ్మానందం,. అరవపల్లి వెంకట మురళి, మద్దు వెంకట సుబ్బా రావు, గాజుల ఎల్లమంద ప్రసాద్ ,వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.




# వెంకటగిరి నియోజకవర్గంలో
## నూతనంగా సొసైటీ చైర్మన్ ల ప్రమాణ స్వీకారం



వెంకటగిరి, నియోజకవర్గం ఇన్చార్జ్ - విసీ.సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): వెంకటగిరి నియోజకవర్గంలోని వ్యవసాయ సహకార సంఘం సొసైటీలకు త్రిసభ్య కమిటీ నామినేటెడ్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే ఇందులో భాగంగా వేంకటగిరి ఎస్ ఆర్ ఎల్ కళ్యాణమండపం నందు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల పిఎసిఎస్ అధ్యక్షుల, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎన్ డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి , డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు జెన్నీరమణయ్య , నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎస్ ఎస్ ఆర్ నాయుడుతొ కలిసి పాల్గొన్నరు వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ. ఈ సందర్భంగా, డక్కిలి, బాలయపల్లి మండలాలకు సంబందించిన 14 సొసైటీలకు ఛైర్మనతో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా డక్కిలి మండలంలో ఉన్న ఏడు సింగిల్ విండోలకు ఛైర్మనలను నియమించారు..... మాధవాయపాళ్లెం సొసైటీ అధ్యక్షులుగా టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, డక్కిలి సొసైటీ అధ్యక్షులుగా వెలికింటి రమణారెడ్డి, దగ్గవోలు సొసైటీ అధ్యక్షులుగా పాతనాలపాడు గ్రామానికి చెందిన ఈతమొక్కల సురేంద్ర , లింగసముద్రం సొసైటీ అధ్యక్షలుగా రంగినేని రాజా , మొపూర్ సొసైటీ అధ్యక్షులుగా పులి జనార్దన్ రెడ్డి, గొల్లపల్లి సొసైటీ అధ్యక్షులు గా నర్రావుల భాస్కర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ అధికారులు, ఎఎంసీ ఛైర్మన్, బాలాయపల్లి, డక్కిలి అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, తిరుపతి పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర, నియోజకవర్గ అనుబంధ కమిటీ సభ్యులు, మండలాల కమిటీ సభ్యులు, జనసేన పి ఓ సి కమిటీ సభ్యులు, పట్టణ అధ్యక్షులు, నాయకులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ, ఇండియా
## కూటమి నాయకుల అరెస్టు దారుణం షేక్.కరీముల్లా



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏంపి ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలో ఎన్నికల కమిషన్ డిజిటల్ ఓటర్ లిస్ట్ ఇవ్వాలని, ఓటర్ జాబితా తప్పుల తడకతో ఉందని, దాన్ని సరి చేయాలనీ ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ కరీముల్లా ఖండిచారు.సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పత్రికా ప్రకటనలో ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అనేది పునాది లాంటిదని, అలాంటి ఓటు ను ఎన్నికల కమిషన్ విలువ లేకుండా చేసిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ బిజెపికి కాపు కాస్తున్నదని, మా నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన డిజిటల్ ఓటర్ జాబితా ఎందుకు ఇవ్వడం లేదు సీసీటీవీ ఆధారాలు ఎందుకు నాశనం చేశారనీ ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారు.ఈ ప్రశ్నలకు జవాబు ఇవ్వలేక అరెస్ట్ లు చేస్తారా ఈ పరిణామాలు చూస్తూ ఉంటే ఎన్నికల కమిషన్, బీజేపీ ఒకటై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని ఆయన విమర్శించారు.

# అటవీ భూముల సమస్య పరిష్కారం

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): శ్రీకాళహస్తి మండలం ఇలగనూరు రెవెన్యూ పంచాయతీలోని సింహాచలం కండ్రిగ గ్రామం నందు 55 ఏళ్లగా గ్రామస్తులకు, అటవీ శాఖ అధికారులకు భూ సమస్యపై జరుగుతున్న వివాదంపై పట్టణంలోని పంచాయతి రాజ్ అతిథి గృహంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిష్కార సభను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డివిజన్ లోని అటవీ శాఖ అధికారులు,సింహాచలం కండ్రిగ గ్రామస్తులు వారి సమస్యలను కలెక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు,న్యాయ పరిష్కారం జరిగే విధంగా సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ హామీని ఇచ్చారు,వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని ఇలగనూరు రెవెన్యూ పంచాయతీలోని సింహాచలం గ్రామం నందు గత 50 సంవత్సరాలుగా అటవీ శాఖ, గ్రామస్తులకు జరుగుతున్న భూ వివాదం పై బుధవారం గ్రామస్తులతో మాట్లాడి మంచి పరిష్కారం తీసుకున్నామని తిరుపతి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తెలియజేశారు.1970 లోనే అటవీ రిజర్వ్డ్ భూములుగా ప్రభుత్వం గుర్తించిందని అన్నారు,1975 రైతులకు ఇచిన పట్టాలు మొత్తం ప్రభుత్వం అడవి రిజర్వ్డ్ భూములుగా గుర్తించి ఇవ్వడం కుదరదని పట్టాలను రద్దు చేసిన రెవిన్యూ శాఖ అధికారులు,2010 అప్పట్లో రైతులు కోర్టు ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు,కోర్టు కూడా 2014లో అది అడవి రిజర్వ్డ్ భూములుగా గుర్తించి రైతులకు ఇచ్చిన పట్టాలను వెంటనే రద్దు చేసి అటవీ శాఖకు అప్పగించాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు, గ్రామస్తులు కూడా నష్టపోకుండా ఇతర ప్రదేశంలో సాగుభూమి ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నామని అన్నారు,ఈ నిర్ణయాన్ని ఇలగనూరు రెవెన్యూ సింహాచలం కండ్రిగ గ్రామస్తులు హర్షించారని,త్వరలోనే గ్రామస్తులకు సాగుభూమి అందజేస్తామని తెలియజేశారు, సింహాచలం గ్రామం నందు హరిత అభివృద్ధి కింద చేస్తున్న పథకాన్ని ఎక్కడ గ్రామస్తులు అడ్డుకోమని అన్నారని,ఇక ఈ ప్రదేశంలో హరిత అభివృద్ధి హరిత వనం త్వరలోనే పూర్తవుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, అటవీశాఖ అధికారులు లోకేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు,బిజెపి నేత కోలా ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రముఖ విద్యావేత్త చిన్న వెంకట్ రెడ్డి మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి .

నల్గొండ ఉమ్మడి జిల్లా . ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన్న వెంకట్ రెడ్డి గారి మరణం పట్ల తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తనను చాలా కలచివేసిందని తెలిపారు. విద్యా వేత్త అయిన చిన్న వెంకట్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు.విద్య ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని విద్యా సంస్థలు నెలకొల్పి లాభాపేక్ష లేని విద్యను చిన వెంకట్ రెడ్డి అందించారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన నెలకొల్పిన మూడు పాఠశాలలు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలుగా నేటికి ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తూనే ఉన్నాయని వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప ప్రకటన ద్వారా తెలిపారు.

## కొండకింది చిన్నవెంకట్ రెడ్డి మృతికి సంతాపం.
## మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి.

నల్లగొండ ఉమ్మడి జిల్లా.నల్లగొండ సీనియర్ సిటిజన్ ప్రముఖ విద్యా వ్యవస్థ కొండెక్కింది చిన్న వెంకటరెడ్డి మృతికి నల్లగొండ మాజీ శాసనసభ్యులు నంద్యాల నరసింహారెడ్డి ఒక ప్రకటనలో సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. చిన్న వెంకటరెడ్డి నల్లగొండ పట్టణంలో శాంతిని నెలకొల్పడంలో , శాంతి సంఘంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నల్లగొండలో విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వ ప్రవేట్ రంగంలో సంస్థలను స్థాపించే వాళ్లని ప్రోత్సహించారని గుర్తు చేశారు. సాహిత్య రంగానికి కూడా ఆయన ఎనలేని సేవలు చేశారని చెప్పారు. నల్లగొండ పట్టణంలో చిన్న చిన్న వెంకట్ రెడ్డి అంటే తెలియని వారు ఉండరని పేర్కొంటున్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణానికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## ప్రముఖ విద్యావేత్త చిన్న వెంకట్ రెడ్డి
## మరణం పట్ల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి దిగ్భ్రాంతి

.స్వాతంత్ర్య సమరయోధుడు,ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన్న వెంకట్ రెడ్డి మరణం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.విద్య ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని విద్యా సంస్థలు నెలకొల్పి లాభాపేక్ష లేని విద్యను చిన వెంకట్ రెడ్డి అందించారని కొనియాడారు. ఆయన నెలకొల్పిన మూడు పాఠశాలలు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలుగా ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తూనే ఉన్నాయని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడు,విద్యా వేత్త అయిన చిన్న వెంకట్ రెడ్డి తో మంత్రికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చిన్న వెంకట్ రెడ్డి ఆశయ స్ఫూర్తిని కొనసాగిస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విద్యావేత్త కొండకింది చిన్న వెంకటరెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేస్తే శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

ప్రముఖ విద్యావేత్త, సాహితీ అభిలాషకులు, నల్లగొండ పట్టణ పుర ప్రముఖులు కొండ కింది చిన్న వెంకటరెడ్డి , పార్థివ దేహానికి, మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సాహితీవేత్తగా... నల్లగొండ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ప్రముఖులని, వారి మరణం ఎవరూ పూడ్చలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామంటూ తెలియజేశారు . నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి. తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి, బక్క పిచ్చయ్య, జగ్జీవన్,వీరమల్ల భాస్కర్ తో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# ఆగస్టు 25న ఇందిరా పార్క్ దగ్గర ఎంపీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

బీసీల సత్య గ్రహ దీక్షను విజయవంతం చేద్దాం

-బీసీలు అందరు ఆహ్వానితులే అధ్యక్షులు..వల్లెపు మాధవరావు

చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లేకుండా స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అధికార కాంగ్రెస్ పార్టీకి బీసీలు తాగిన గుణపాఠం చెప్పాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షులు మాధవరావు డిమాండ్ చేశారు. రిజర్వేషన్ రావడం వలన ఉద్యోగ అవకాశాలు బీసీలకు లభిస్తాయని. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లోపు బీసీలకు 42 శాతం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని . తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలలో బీసీలు పోటీ చేయడానికి ముందు వరుసలో ఉన్నారని. ముఖ్యంగా ఉన్నతమైన చదువులు చదివిన విద్యార్థులకు ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని కనీసం బీసీలకు రిజర్వేషన్ కల్పించడం వలన చదువుకున్న మేధావులు స్థానిక సంస్థలలో సర్పంచగా గెలవడం వలన, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఆగస్టు 25 న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపటనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతీక ప్రకటనలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు వల్లెపు మాధవరావు తెలిపారు . శేరిలింగంపల్లి బిసి కుటుంబ సభ్యులు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయడానికి భారీ సంఖ్యలు తరలి రావాలని ఆయన కోరారు.

# ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా

-ఫోటో గ్రాఫర్లను ను సన్మానించిన..బలరాం యాదవ్

: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ కాలనీ కి చెందిన గణేష్ యాదవ్, శ్రీనివాస్, నవీన్ ను సన్మానించారు. గత 15 సంవత్సరాలుగా బొటానికల్ గార్డెన్ నుండి చుట్టుపక్కల ప్రాంతాలలో సరైన రోడ్డు సౌకర్యం లేని సమయం నుండి కొండాపూర్ డివిజన్ ప్రజలకు అందు బాటులో ఉంటూ ఫోటో అంటే ఈ భూ ప్రపంచంపై మనిషి జ్ఞాపకాన్ని రూపాన్ని చూపించేదే ఫోటోగ్రఫీ, ఇలాంటి మంచి వృత్తిని ఎంచుకొని ప్రతి ఒక్కరితో స్నేహ భావంగా మెదిలే గణేష్ ను ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నవీన్ బలరామ్ యాదవ్, రమేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, వెంకటేశ్వర్లు, అవదీష్, నారాయణ, జయపాల్ రెడ్డి, అశోక్, సన్నీ యాదవ్, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ
# ఆలయ అభివృద్ధికి క్రుషి చేస్తాం

-మక్తా కాలనీ వాసులు

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ డివిజన్ పరిధిలో గల మక్త మహబూబ్ పేట్ గ్రామ శివారులో గల మిదికుంట చెరువు కట్ట మైసమ్మ ఆలయాన్నీ అభివృద్ధి చేస్తామని మక్త గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులందరూ కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. త్వరలో ఆలయ అభివృద్ధి కమిటీనీ ఏర్పాటు చేసి, కమిటీ ద్వారా సమష్టి నిర్ణయాలు తీసుకొని మన సంస్కృతి, సంప్రదాయ పండుగలు నిర్వహిస్తూ, భక్తులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండె గణేష్ ముదిరాజ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్ లు విడుదల చేయాలి ఐక్య విద్యార్థి సంఘాలు (టివియువి, ఎన్ఎస్ఎఫ్)



శుభోదయం న్యూస్, మంచిర్యాల జిల్లా: : చెన్నూరు మండల కేంద్రంలో ఈరోజు ఐక్య విద్యార్థి సంఘాలు పెండింగ్ స్కాలర్షిప్ లు విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులతో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్షిప్ (ఫీజు రీయింబర్సమెంట్) గత మూడు సంవత్సరాలుగా సుమారు 7వేల కోట్ల నిధుల బకాయిలు ఉన్నాయని, పెండింగ్ స్కాలర్షిప్ లు విడుదల చేయకపోవడంతో వివిధ రకాలైన కోర్సులు చదువుతున్న విద్యార్థులు తమ ఉన్నత చదువులు కొనసాగించలేక పోతున్నారని అన్నారు. కొంతమంది విద్యార్థులు తమ కోర్సును పూర్తిచేసుకుని సర్టిఫికెట్స్ కోసం కళాశాలలకు వెళితే పలు ప్రైవేటు యాజమాన్యాలు ఫీజు చెల్లించనిదే సర్టిఫికెట్లు ఇవ్వబోమని చెప్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్ ల విడుదల విషయంలో మీన మేషాలు లెక్కించడం, కాకమ్మ కథలు చెప్పడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులు పడుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్(ఫీజు రీయింబర్స్మెంట్ల)ను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థి సంఘాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు.

## కోట వెంకటాపురంలో మైసమ్మ బోనాలు సమర్పించుకున్న గ్రామస్తులు




పరకాల (శుభోదయం న్యూస్): వెంకటాపురం గ్రామంలో పోచమ్మ బోనాల కార్యక్రమంలో మహిళలు డప్పు చప్పులతో శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా బయలుదేరి పోచమ్మకు నైవేద్యాలు సమర్పించుకున్నారు ఈ గ్రామ బొట్టు దారుడు, యాదవ కుల పెద్దమనిషి, పెద్దగొల్ల న్యాల అశోక్ యాదవ్, గౌడ సంఘం పెద్దమనిషి నరేష్ గౌడ్, సదానందం గౌడ్, రాజేష్ గౌడ్, కార్తీక్ గౌడ్, సురేష్ గౌడ్, రాజు గౌడ్, దిలీప్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి యాదగిరి, యాకయ్య గౌడ్, న్యాల రవి, కమ్మరి లక్ష్మీ . గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో అందరూ ఆయురారోగ్యాలతో పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

## కాంగ్రెస్ నాయకుని తండ్రి పాడే మోసిన మాజీ ఎంపీపీ భర్త పున్నం రవి



రేగొండ, మండల రిపోర్టర్ మంతెనసురేష్(శుభోదయంన్యూస్) : రేగొండ మండలం రంగయ్యపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొచ్చు మొగిలి , బొచ్చుసదయ్య సోదరుల తండ్రి బొచ్చు రామచేంద్రు బుధవారం అనారోగ్య కారణంగా మరణించారు. కాంగ్రెస్ పార్టీ సోదరుల తండ్రి మరణ వార్త తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లి పార్దివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన అదే రోజు జరిగిన అంతిమయాత్రలో మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవిలు కాంగ్రెస్ శ్రేణులు కలిసి పాడే మోశారు. ఎంపీపీ భర్త రవితో అంతిమయాత్రలో యువ నాయకులుమోరే నరేష్ ,బల్గురి ప్రభాకర్, పాడె మోసి అంత్యక్రియలు పూర్తి వరకు అక్కడే ఉండి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యాంత్రికరణ పథకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం..

చివరి గడువు సెప్టెంబర్ 6

రేగొండ వ్యవసాయ అధికారి పెద్ది వాసురెడ్డి



రేగొండ మందుల రిపోర్టర్ మంతెన సురేష్,( శుభోదయం న్యూస్) రేగొండ మండల కేంద్రలో వ్యవసాయ రంగంలో రైతులకు ఉపయోగపడే యాంత్రికరణ పరికరాలను అందించేందుకు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని మండల వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 గాను రేగొండ మండలానికి చెందిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మేకనైజేషన్) క్రింద వ్యవసాయ యంత్ర పరికరాలకై ఈ ఆర్థిక సంవత్సరం దరఖాస్తులను కోరడమైనది అన్నారు ఈ ఆర్థిక సంవత్సరం కు.2025-26 కు గాను సన్న చిన్న కారు రైతులు, మహిళ రైతులకు, ఎస్సి, ఎస్టి రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.అర్హులైన ఇట్టి రైతుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం క్రింద రేగొండ మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్ -75, పవర్ స్ప్రేయర్స్- 25, రోటవేటర్స్-5, కల్టివేటర్స్-6, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 1, బ్రష్ కట్టర్ 1, పవర్ టిల్లర్-1 మరియు స్ట్రా బేలర్ 1 కేటాయించడం జరిగిందాని,ఇట్టి పథకానికి ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్ టి, జనరల్ మహిళా రైతులు దరఖాస్తు తో పాటుగా, కొత్తగా జారీచేసిన పట్టాదార్ పాస్ పుస్తకం కాపీ,, ఆధార్ కార్డు కాపీ కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్ కు సంబంధించిన పరికరాలకై రిజిస్ట్రేషన్ పేపర్స్ తో ఫోటో అతికించిన దరఖాస్తును మీ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు రైతు వేదికలో సంప్రదించి సెప్టెంబర్ 6వ తేదీలోగా దరఖాస్తులు అందజేయవలసిందిగా అర్హులైన రైతులను కోరుతున్నామని ఆయన అన్నారు.ఈ పథకంలో రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే మీ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారుల్ని సంప్రదించగల ఏవో వాసుదేవర్ రెడ్డి సూచించారు.

## ఎస్సై రాజేష్ ను కలిసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రమదాదేవి



రేగొండ, మండల రిపోర్టర్ మంతెన సురేష్,( శుభోదయం న్యూస్):రేగొండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా కె. రాజేష్ బాధ్యతలు చేపట్టడంతో మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు బూర్గుల ప్రమదాదేవి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా రాజేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మహిళా అధ్యక్షురాలు ప్రమదాదేవి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మహిళా అధ్యక్షురాలతో పాటు పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఎస్సైని కలిశారు.

## కంటోన్మెంట్లో ఘనంగా రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలు



తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్), ఆగస్ట్ 20: భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, రాజీవ్ గాంధీ విగ్రహ స్థాపన కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పిడి గోపాల్, టిపిసిసి సెక్రెటరీ రాజేష్ యాదవ్ లు అన్నారు. కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ ఆదేశాల మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గం 3వ వార్డు బలంరాయి చౌరస్తాలో రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలకు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డి.బి దేవేందర్ లు హాజరై స్థానిక నాయకులతో కలిసి, రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... చిన్న వయసులోని దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, పేదల సంక్షేమం కోసం, అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేశారని, ఐటీరంగను ఎంతో అభివృద్ధి చేసి దేశ యువతకు ఉద్యోగాలు కల్పించారని, వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈపూరు వినోద్ కుమార్, సంద్రపాటి నాగరాజు, ఎస్.సి.ఆర్.పి.ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, దళిత రత్న అవార్డు గ్రహీత దర్గా రవికుమార్, సికింద్రాబాద్ గణపతి దేవాలయ ధర్మకర్త వినోద్, 3వ వార్డు ఇన్ చార్జీ మహేష్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు అస్లాం సోఫీ, సంతోష్, అన్నా నగర్ మురళి, ఇటుక గోపి, నగేష్ యాదవ్, అజ్గర్, గిరి, వార్డు 3 వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ధర్మపురి సంపత్ రాజారాం యాదవ్ వర్ధంతి



తెలంగాణ స్టేట్ బ్యూరో రామారావు (శుభోదయం న్యూస్): ఈ రోజు వరంగల్ జిల్లా ఆరెపల్లి గ్రామం లో డాక్టర్ ధర్మపురి సంపత్ రాజారాం యాదవ్ గారు బహుజన ఉద్యమ కారుడు ఈ దేశంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రులు ,ప్రధాన మంత్రి,రాష్ట్రపతి లుగా బిసి లు ఎన్నిక కావాలని కలలు కన్నా వ్యక్తి.డాక్టర్ సంపత్ రాజారాం యాదవ్ వర్ధంతి సందర్భంగా వరంగల్ మాజీ కూడ చేర్మెన్ సుందర్ రాజ్ యాదవ్ గారి ఆధ్వర్యం లో పాల్గొన్నా డాక్టర్ శ్రీకాంత్ యాదవ్,డాక్టర్ మల్లేష్ యాదవ్,కార్పొరేటర్ లు జక్కుల రవీందర్ యాదవ్,కవిత యాదవ్,జనగాం జిల్లా యాదవ సంఘం నాయకులు సిద్దిరాజు యాదవ్,వరంగల్ జిల్లా నాయకులు చిన్నాల యశ్వంత్ యాదవ్,బొంగు రాజు యాదవ్,అశోక్,బుట్టి శ్యామ్ యాదవ్,దాడి మలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్ట్ ను బహిరంగ ప్రదేశాలలో వేస్తే హాస్పిటల్ నిర్వాహకులకు జరిమానా

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఏ సి) జె. అరుణ శ్రీ




గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్ట్ ను బహిరంగ ప్రదేశాలలో , చెత్త కుండీలలో వేసిన హాస్పిటల్స్ నిర్వాహకులకు జరిమానా విధించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. హాని కారక బయో మెడికల్ వేస్ట్ ను నగర పాలక సంస్థ సిబ్బంది తొలగించడం లేదా మున్సిపల్ వాహనాలలో తరలించడం జరగదని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆద్వర్యంలో పని చేస్తున్న అధికారిక ఏజెన్సీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనానికి ఈ బయో మెడికల్ వేస్ట్ అందించి సహకరించాలని కోరారు.

## బీసీ సమస్యల సాధనకై ఆగస్టు 25న ఇందిరా పార్కు వద్ద జరిగే సత్య గ్రహ దీక్ష విజయవంతం చేయండి

వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన తెలంగాణ బీసీ ప్రజా సంఘం రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు పొలవేణి నరేశ్



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):ఈనెల 25న తేదీన ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సమస్యల కోసం నిర్వహించే సత్య గ్రహ దీక్ష వాల్ పోస్టర్ ను రామగుండం నియోజకవర్గం లో తెలంగాణ బీసీ ప్రజా సంఘం నియోజక వర్గం అధ్యక్షులు పోలవేణి నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ముందు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో గర్వందుల శ్రీకాంత్, అన్వేష్, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్పల్లిలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు సుడిగాలి పర్యటన

జడ్ పిహెచ్ఎస్ బాలికల, సిక్కుల మహిళలకు జిల్లా చీఫ్ శ్రీజ్యోతి బీమ్ భరత్ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్లు అందజేత



శుభోదయం ప్రతినిధి ప్రవీణ్ శంకర్పల్లి: ఆగస్టు 20: ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మిషన్ ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు అన్నారు. శంకర్పల్లి మున్సిపల్ పరిధిలో బుధవారం సునీతారావు సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు, 14వ వార్డు సిక్కుల మహిళలకు జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి బీమ్ భరత్ ఆధ్వర్యంలో నారి మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ సానిటరీ ప్యాడ్లను అందజేశారు. అనంతరం విద్యార్థినులకు సునీతా రావు క్లాస్ రూమ్ లో సైన్స్ కు సంబంధించిన పాఠాలు బోధించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోని బాలికల పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మిషన్స్ పంపిణీ చేస్తామని తెలిపారు.

### సునీతారావు మాట్లాడుతూ

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదిక ప్రకారం 15-24 ఏండ్ల మధ్య వయసున్న బాలికలు/ యువతుల్లో సుమారు 32 శాతం మంది రుతుక్రమం సమయంలో వస్త్రాలనే వినియోగిస్తున్నారు. వాటి అపరిశుభ్రత వల్ల గర్భాశయ, మూత్రకోశ సంబంధ ఇన్ఫెక్షన్లు వస్తున్నాయని వైద్యనిపుణులు చెప్తున్నారు. కొన్నిసార్లు తీవ్ర రక్తస్రావం అయినప్పుడు లీకేజీ అయ్యి విద్యార్థినులు మనోవేదనకు గురవుతున్నారు. దీంతో రుతుక్రమ సమయంలో కొందరు విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందించే ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని నిపుణులు పేర్కొంటున్నారు. రుతుక్రమ సమయంలో పరిశుభ్రతతోపాటు వారు ఆరోగ్యంగా ఉండి చదువుపై ఎక్కువ శ్రద్ధ పెడతారని, హాజరు శాతం కూడా పెరిగేందుకు సహాయపడుతుందని తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి సునీతారావు, శ్రీజ్యోతి బీమ్ భరత్ మధ్యాహ్న భోజనంలో పాల్గొని, విద్యార్థులతో కలిసి, కూర్చొని, స్వయంగా విద్యార్థులకు తినిపించి భోజనం చేశారు. 14వ వార్డు సిక్కుల కాలనీలో వారు పర్యటించి, రోడ్లను స్వయంగా పరిశీలించారు. వారి సమస్యలను తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను లేనివారికి త్వరలోనే అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ అరుంధతి నియోజకవర్గ, మండల, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మరకత శివాలయంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు పూజలు



శుభోదయం ప్రతినిధి ప్రవీణ్/ శంకర్పల్లి: శంకర్పల్లి మండల చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు సదానందం గౌడ్, చైర్మన్ గోపాల్ రెడ్డి లు సునీత రావును స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి బీమ్ భరత్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## పండుగలు భక్తిని చాటాలి.



పాపన్నపేట ఆగస్టు 20 శుభోదయం న్యూస్ : పండుగలు భక్తిని చాటాలి. కానీ విషాదాలు కావద్దు. వినాయక చవితి ఊరేగింపులు, శోభాయాత్రలు తగిన జాగ్రత్తలతో నిర్వహించుకోవాలి. వినాయక విగ్రహాలు వీలైనంత చిన్నవిగా ఉండాలన్నారు. పరిమితికి మించి పెద్ద విగ్రహాలు తెచ్చేటప్పుడు, నిమజ్జన సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. మండపాల డెకరేషన్, సౌండ్ బాక్స్ ల ఏర్పాట్లలో విద్యుత్ తో జాగ్రత్తగా ఉండాలి. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్ లైన్ లో అనుమతి తీసుకోవాలి. నిమజ్జనం సమయంలో మత్తు పదార్థాలు సేవించవద్దని, చెరువులు, కుంటల్లో లోతుకు వెళ్లొద్దని పాపన్నపేట ఎస్సై .శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

## గణేష్ మండపాలు సూచనలు ప్రకారం నడవాలి ఎస్సై బాలరాజ్



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 20:- మెదక్ జిల్లా రామాయంపేట మండల మరియు మున్సిపాలిటీ పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ప్రభుత్వం మరియు పోలీసువారు చేసిన సూచనల ప్రకారం నడచుకోవాలని రామాయంపేట ఎస్సై బాలరాజ్ తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు రసాయనిక విగ్రహాలను ప్రతిష్ట చేయరాదని పేర్కొన్నారు.మట్టి గణపతులను ప్రతిష్టించాలని,మంటపాలకు అక్రమంగా కరెంట్ కనెక్షన్లు తీసుకోరాదని విద్యుత్ అధికారుల అనుమతితో తీసుకోవాలని తెలిపారు.హై సౌండ్ సిస్టం డీజేలు కానీ వాడరాదని వాటిని నిషేధించడం జరిగిందని తెలిపారు.గణేష్ మండపాల వద్ద రాత్రి పగలు ఇద్దరిద్దరూ వ్యక్తులు కాపాల ఉండాలని మంటపాల నిర్వాహకులను పేర్కొన్నారు.అవసరం ఉన్న గణేష్ మంటపాల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని తెలిపారు.సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.జాతి,మత కులాలపై విద్వేషకరమైన ప్రసంగాలు చేయవద్దని పేర్కొన్నారు.ప్రతి మండప నిర్మాణానికి ఆన్లైన్లో పోలీస్ స్టేషన్ నుంచి అనుమతులు పొందాలని తెలిపారు.పోలీసులు నిర్ణయించిన చెరువుల ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు.నదులను చెరువులను కాలుష్యం చేయరాదని తెలిపారు.మంటపాల వద్ద చెత్త చెదారం లేకుండా ప్రతి రోజు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.ఊరేగింపులకు ట్రాఫిక్ అంతరాయం ఇబ్బందులు లేకుండా వాలింటీర్లను నియమించుకోవాలని తెలిపారు.తక్షణ సాయం కోసం డయల్ 100 ఫోన్ చేయాలని లేదా 8712657934, 8712657892 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## . యూరియా అందుబాటులో ఉంది మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



పాపన్నపేట, ఆగస్టు 20 శుభోదయం న్యూస్: రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ లోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంటలకు సరిపడ యూరియా,ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆ కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ఈసందర్బంగా తహసీల్దార్ సతీష్ కుమార్,వ్యవసాయ అధికారి నాగమాధురి,ఏఈవో లు జనార్దన్,నాగరాజు తదితరులు ఉన్నారు.

## గోదావరి తిర ప్రాంతాలు హై అలర్ట్ రెండో ప్రమాద హెచ్చరిక లెవెల్ దాటి ప్రవాహం




శుభోదయం న్యూస్ మంగపేట మండల రిపోర్టర్- తులసి: గోదావరి వరద ఉధృతి మంగళవారం ఉదయం నుంచి పెర గడంతో మండల అ ధికార యంత్రాంగం హై అలర్ట్ అయింది. బుధవారం రాత్రికి గోదావరి వరద ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో తట్టు ప్రాం తాలు జలమయ మయ్యే అవకాశాలు ఉండడంతో మండల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.గో దావరి ఎగువ ప్రాం తంలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుండి ప్రాజె క్టుల నుండి నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో బిల్ట్ ఇంటెక్వెల్ వద్ద మంగపేట పుష్కర ఘాట్ వద్ద గోదావరి ఉగ్రరూపంతో ప్రవ హిస్తుంది.బుధవారం మధ్యాహ్నం నుండి ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పు ష్కరఘాట్ వద్ద రెండో ప్రమాద హె చ్చరిక లెవెల్ దాటి గోదావరి నది ప్రవహి స్తుంది.గోదావరి నది ప్రవాహం క్షణం క్షణం పరిశీలిస్తున్న మం డల అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.గోదావరి ముంపు గ్రామ లు అయినా కమ లాపురం,పోదు మూ రు,అఖినే పల్లి మల్లా రం,గుడ్డేలుగులపల్లి తహసీల్దార్ తోట ర వీందర్,ఎస్సై తిరున గిరి వెంకట రంగా సూరి (టీవీఆర్ సూరి) మండల ప్రత్యేక అధికారి సిద్ధార్థ రెడ్డి, ఎంపీడీవో బద్రు నా యక్,ఎంపీఓ శ్రీని వాస్ ఐదుగురు ఒక టీంగా ఏర్పడి మండ లంలోని వరద పరి స్థితిని పరిశీలిస్తూ లోతట్టు ప్రాంత ప్ర జలను అప్రమత్తం చేస్తున్నారు.లోతట్టు ప్రాంతాలలోని ఇం డ్లలో నీరు చేరితే ఆ కుటుంబాలను పున రావాస కేంద్రాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చే స్తున్నారు.

## భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించిన. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి




శుభోదయం న్యూస్, మంగపేట మండల రిపోర్టర్ - తులసి: రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోకన్న సూచనల మేరకు. ఆగస్టు 20 వ తారీకు నాడు అనగా బుధవారం ఈరోజు దివంగత నేత స్వర్గీయ మాజీ ప్రధాని భారత రత్న రాజీవ్ గాంధీ 81 వ జయంతిని పురస్కరించుకొని మంగపేట మండల కేంద్రంలోని వైస్సార్ విగ్రహం ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులచే ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి మాట్లాడుతుమన భారత దేశం లో గాంధీ కుటుంబ నేపథ్యం నుండి ఇందిరా గాంధీ స్వర్గస్థులు అయినా తరవాత ఆమె రాజకీయ వారసులు గా ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ భారత దేశ 6 ప్రధానిగా అయ్యారు ప్రధాన మంత్రి గా ఉన్న సందర్భంలో దేశానికి మరువలేని సేవలు చేసి అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి ,ప్రజల సంక్షేమానికి మరువలేని సేవలు అందించారని కొనియాడారు. రాజీవ్ గాంధీ భారత దేశనికి ఒక ప్రధాన మలుపు బిందువు గా సూచించవచ్చు దేశానికి ఆధునిక, సాంకేతిక అభివృద్ధి చెందిన వైపు కు నడిపిన ఒక యోధుడు అదేవిధంగా కంప్యూటర్లు, టేలీకం పరిశ్రమలను ప్రోచ్ఛహించడం లో అయన పాత్ర మరువలేనిది,పంచాయతీ రాజ్ ల శక్తికరణ, విద్య వ్యవస్థ సంస్కారణలు, ఆర్థిక సంస్కారణలు,ఐటీ పరిశ్రమలు, టేలీకమ్యూనికేషన్, ఇలా అనేక వ్యవస్థలను తీసుకొచ్చి భారత దేశ ఆర్థిక వ్యవస్థ ను నిర్మించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని అయన తెలిపారు. ఈ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా కార్యదర్శి తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నర్సింహారావ్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు టీవీ హీదాయ తుల్లా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శానం నిర్మల, గ్రామ కమిటీ అధ్యక్షులు సదయ్ హుసేన్,మండల సీనియర్ నాయకులు.. సత్యం, ఎడ్ల నరేష్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, బండ పల్లి నర్సయ్య,మూగల చంటి, భూక్యా కుమార్, చాద శేఖర్, రమణాకర్, కాస్ప ముకుందాం,మూగల ముసలయ్య, సతీష్, వడ్లకొండ లక్ష్మి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో యువత ప్రాతినిధ్యం వహించాలి ఎంబటి నవీన్ బిజెపి సోషల్ మీడియా ఇన్చార్జి



శుభోదయం న్యూస్, మంగపేట మండల రిపోర్టర్ - తులసి: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యావంతులైన యువతి యువకులు ప్రశ్నించేందుకు ముందుకు రావాలని బిజెపి సోషల్ మీడియా ఇన్చార్జి ఎంబటి నవీన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం మనల్ని పట్టించుకోవట్లేదు అనే భావనను యువత వదిలి, అసలు ప్రభుత్వం ఏం చేస్తుందో వారి అజెండా ఏమిటి? వారి విధివిధానాలు ఏంటి? ఎన్నికలలో వారిచ్చిన గ్యారెంటీలను, వాగ్దానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉండాలని ఆయన అన్నారు. సమకాలిన రాజకీయాలను యువత ఓ కంటితో కనిపెడుతూనే ఉండాలన్నారు. యువత రేపటి దేశ భవిష్యత్తు అని ఆయన అన్నారు. యువత ప్రభుత్వ తప్పులను ఎండ కట్టటం మొదలుపెడితే కచ్చితంగా పాలనలో మార్పు మొదలవుతుందని ఆయన అన్నారు. రాజకీయ వ్యవస్థలో మార్పు తెచ్చే సత్తా యువతకే ఉందన్నారు పాలనాపరమైన, రాజకీయపరమైన నిర్ణయాల్లో యువత పాత్ర తప్పక ఉండాలని అన్నారు. ఐదేళ్లకోసారి ఓటు వేస్తే బాధ్యత అయిపోయినట్లే అని భావించకుండా వ్యవస్థలో జరుగుతున్న అవినీతిని దోపిడీ, పీడన లను అనునిత్యం ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలన్నారు. రాజకీయాలు చెడిపోయాయని భావించవద్దు, వాటిని సమూలంగా మార్చగలిగే శక్తి యువత చేతిలోనే ఉంది ఓటు అనే వజ్రాయుధాన్ని ఉపయోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో నవశఖాన్ని యువత సృష్టించాలి. కొన్ని శక్తులు రాజకీయాలను రాక్షసత్వంగా మార్చాయి త్వరలోనే అవినీతి కుళ్ళు, కుతంత్రాలు లేని రాజకీయం వస్తుంది. ఆరోజు అందమైన దృఢమైన యువ భారత్ ను సాధించుకుందాం, వారసత్వ రాజకీయాలు పెరిగిపోవడంతో అనేక పార్టీలు కుటుంబ పాలనను కొనసాగిస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాల్లో యువత క్షేత్రస్థాయి గ్రామ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి గెలుపొంది అంచలంచలుగా ఎదిగి రాజ్యాధికారం చేజిక్కించుకోవాలి, యువతకు ఎప్పుడూ లేని వనరులు ప్రస్తుతం ఉన్నాయి. కావున త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుతో విజయాల ఖాతాను యువత ప్రారంభించాలన్నారు.

## నానో యూరియాతో రైతులకు అద్భుత లాభాలు ఏఓ రాజ్ నారాయణ



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 20:- నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడినటువంటి నానో యూరియా కేవలం 500 మిల్లీలీటర్లు ఒక బస్తా సాంప్రదాయ యూరియాతో సమానం రైతులు క్రమక్రమంగా ఈ నానో యూరియా వైపు మొగ్గు చూపుతున్నారు.ఈ సందర్భంగా రామాయంపేట పట్టణ శివారులో నానో యూరియా పిచికారి చేసిన నర్సింలు అనే రైతు యొక్క వరి పంట క్షేత్రాన్ని వ్యవసాయధికారులు సందర్శించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ మాట్లాడుతూ రామాయంపేట మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 13వేల ఎకరాల్లో వరి పంట సాగైందని ప్రస్తుతం వరి పంట పిలకలు వేసే దశలో ఉందని ఈదశలో నానో యూరియాను పిచికారి చేసుకున్నట్లయితే రైతులకు మంచి లాభాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు.ముఖ్యంగా సాంప్రదాయ గుళికల రూపంలో ఉండే యూరియా వాడినప్పుడు కేవలం 30 శాతం మాత్రమే మొక్క స్వీకరించే అవకాశం ఉందని,మిగతా 70% వృధాగా పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.దీని ద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటుగా అధిక మోతాదులో యూరియా వాడాల్సిన అవసరం ఏర్పడుతుందని తెలిపారు.అధిక యూరియా వాడడం వల్ల పంటలలో చీడపీడల సమస్య ఎక్కువగా ఏర్పడి పంట దిగుబడి పై తీవ్ర దుష్ప్రభావం ఉండడంతో పాటుగా రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా విస్తృతంగా నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.కొందరు ఔత్సాహిక రైతులు ఈ నానో యూరియాను వాడి మంచి ఫలితాలు ఉన్నాయని వారి అభిప్రాయం తెలియజేయడం జరిగిందని తెలిపారు.ఈ నానో యూరియా ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినటువంటి ద్రవరూప ఎరువైనటువంటి నానో యూరియా చిన్నచిన్న కణాలుగా విభజించబడి నేరుగా మొక్కల యొక్క పత్ర రంధ్రాలకు వెళ్లడం ద్వారా సుమారుగా వేసిన ఎరువులు 80% మొక్కకు అందే అవకాశముందని పేర్కొన్నారు.ఈ పద్ధతిలో రైతుకు తక్కువ ఖర్చుతో పాటుగా ఎరువుల వినియోగ సామర్థ్యం అధికంగా ఉండటం వల్ల పంటలు దిగుబడిపై మంచి ప్రభావం ఉండే అవకాశం ఉంది.కావున రైతులు సాంప్రదాయ యూరియాకు బదులుగా ఈ నానో యూరియాను వాడాల్సిందిగా రైతులకు సూచించడం జరుగుతుంది.ఈ బుధవారం రైతు క్షేత్రాన్ని సందర్శించడం జరిగిందని,నానో యూరియా వాడిన రైతు కూడా ఈ నానో యూరియా వల్ల పంట బాగా ఉందని తన సానుకూల అభిప్రాయం వెళ్లి బుచ్చడం జరిగిందని,మండల వ్యాప్తంగా 3000 బాటిల్ల నానో యూరియా అందుబాటులో కలదు.కావాల్సిన రైతులు ఈ నానో యూరియా వాడాల్సిందిగా కోరడం జరుగుతుందని తెలియపరచారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రవీణ్ తో పాటుగా రైతులు రాములు,నర్సింలు,కిషన్ తదితరులు పాల్గొన్నారు

# హెల్త్ క్యాంపు




శుభోదయం న్యూస్, మంగపేట మండల రిపోర్టర్ - తులసి: బుధవారం రోజున చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బెస్తగూడెం గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది అలాగే గ్రామ ప్రజలందరికీ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి పరిసరాల మరియు వ్యక్తిగత పరిశుభ్రత గురించి ఇంటి చుట్టూ చెత్త గాని, అలాగే నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని , కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించడం జరిగింది, ఈ కార్యక్రమంలో డాక్టర్ యమున, పద్మ హెచ్ వి,మరియు ఆశలు పాల్గొన్నారు. టోటల్ ఓపి -58 ఫీవర్ కేసెస్ -6 మలేరియా మరియు డెంగ్యూ నెగిటివ్.

## తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతి





రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): సంక్షేమ పథకాలు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆర్థికంగా బలహీన వర్గాల కోసం ఆర్థిక సహాయం, రైతు రుణ మాఫీ, పంటల నష్టపరిహారం, విద్యార్థులకు స్కాలర్షిప్స్, మైనారిటీ మహిళల అభివృద్ధి పథకాల అమలు. రాబోయే ప్రణాళికలు యువత ఉపాధి అవకాశాలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, రైతు బజార్ల విస్తరణ, ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు.పార్టీ బలోపేతం గ్రామ, మండల స్థాయిలో పార్టీ శ్రేణులను బలోపేతం చేయడం, ప్రజల సమస్యలను నేరుగా వినిపించేలా వ్యవస్థను బలోపేతం చేయడం.ఈ సమావేశంలో జిల్లా స్థాయి అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సంక్షేమ పథకాలు, భవిష్యత్ ప్రణాళికలు మరియు పార్టీ బలోపేతంపై సమగ్ర చర్చ జరిగింది.

## బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన ఖని నాయకులు



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): హైదరాబాదులో బుధవారం రోజున బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను తస్మిం భాను జాహిద్ పాషా మర్యాదపూర్వకంగా కేటీఆర్ ను కలిసినారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి వ్యాల్ల హరీష్ రెడ్డి నేతృత్వంలో దుబాయిలో ఇబ్బంది పడుతున్న ముస్లిం మహిళలను క్షేమంగా గోదావరిఖని తీసుకొచ్చినందుకు హైదరాబాదు లో కేటీఆర్ నివాసంలో ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపినారు.

## ఈనెల 22 23 తేదీలలో పశ్చిమ మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం



రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): ఈనెల 22 ,23 తేదీలలో రామగుండం పశ్చిమ మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు జడ్పీహెచ్ఎస్ ఎన్ టి పి సి జ్యోతి నగర్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించ నున్నట్లు మండల విద్యాధికారి జి మల్లేశం తెలిపారు. 22న బాలికల అండర్ 14 అండర్ 17 విభాగంలో కబడ్డీ కోకో వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ క్రీడ పోటీలు అలాగే 23న బాలురలు కబడ్డీ కోకో వాలీబాల్ మరియు క్రీడా పోటీలు నిర్వహించ బడతాయన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు తో ఎస్ జి ఎఫ్ ధ్రువీకరణ పత్రము విధిగా తీసుకురావాలనీ తెలిపారు అదనం సమాచారం కోసం జడ్.పి.హెచ్.ఎస్ రామగుండం ఫిజికల్ డైరెక్టర్ ఏ విజయ్ కుమార్.9849218365 జడ్పీహెచ్ఎస్ ఎన్ టి పి సి ఫిజికల్ డైరెక్టర్ ఎండి జావిద్ మొబైల్ నెంబర్ 917788 51 83 గారిని సంప్రదించాలని మండల విద్యాధికారి జి మల్లేశం గారు తెలిపారు.

## మల్లన్న గుడి తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 20:- మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మల్లన్న కామన్ దగ్గర ఉన్న మల్లన్న గుడి నందు మంగళవారం రాత్రి అందజా 7:30 గంటలకు పూజారి రాజమల్లయ్య గుడి తాళం వేసి తిరిగి బుధవారం ఉదయం అందజా 7:30 గంటలకు గుడి దగ్గరకు వెళ్ళి చూసేసరికి గుడి తాళం పగుల గొట్టి అందులోని హుండీని దొంగిలించినారని తెలుపగా వెళ్ళి చూసే సరికి నిజంగానే గుడి తాళం పగుల గొట్టి అందులోని హుండీని దొంగిలించినారు.హుండీలో అందజా 5000/- రూపాయల వరకు ఉండేవని దరఖాస్తు రాగ బసన్నపల్లి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై బాలరాజ్ తెలిపారు.

## ఘనంగా జరిగిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో

రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లా ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు తో కలిసి స్థానిక జీఎం ఆఫీస్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి వారి జయంతిని పురస్కరించుకొని పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ది ఆర్కిటెక్ట్ ఆఫ్ డిజిటల్ ఇండియా ,నవ యువతకు స్ఫూర్తి ప్రదాత, భారత దేశ మాజీ యువ ప్రధాని, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ రోజు వారికి నివాళులు అర్పించడం గొప్ప అవకాశం అని అన్నారు.ఈ ఆధునిక యుగంలో ప్రపంచం లోనే భారత దేశం సాంకేతికంగా అగ్ర స్థానంలో ఉండాలనే ఉద్దేశంతో ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు





తీసుకున్న రాజీవ్ గాంధీ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ఐటీ,కమ్యూనికేషన్స్, పరిశోధన, ఆర్థిక, విద్య, పంచాయతీ రాజ్, పరిపాలన, ఎన్నికలు ఇలా అన్ని రంగాల్లోనూ విజనరీ నేతగా పలు సంస్కరణలకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారు అని గుర్తుచేశారు.సాంకేతిక రంగానికి ప్రాధాన్యతనిస్తూ రాజీవ్ గాంధీ 1984లో సెంటర్ ఫర్ డెవలప్?మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్?ను పటిష్టపరచడంతో టెలిఫోన్ రంగంలో ఊహించని మార్పులొచ్చి ఎస్టీడీ, పీసీఓ వ్యవస్థలు దేశంలో సామాన్య ప్రజలకు అందజేసిన ఘనత రాజీవ్ గాంధీ గారిది అన్నారు.జాతీయ విద్యా విధానంతో బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనం కల్పించేలా 1986లో రాజీవ్ గాంధీ జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించి అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీ గారిది అని కొనియాడారు. 61వ రాజ్యాంగ సవరణతో ఓటేసేందుకు కనీస వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతని రాజకీయ నేర్దేశులు చేయాలని తాను కృషి చేశారని తెలిపారు.రాజీవ్ గాంధీ దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని , గ్రామస్థాయి నుంచి అధికార వికేంద్రీకరణ జరగాలనే సంకల్పంతో 1989లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం దేశంలోని పంచాయతీలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తూ మూడు అంచెల వ్యవస్థతో విశేష అధికారాలను కట్టబెట్టేందుకు 64వ రాజ్యాంగ సవరణ చేశారని కొనియాడారు.దేశం ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో దూసుకు పోతుందంటే దానికి కారణం నాడు రాజీవ్ సాంకేతిక రంగానికి పెద్దపీట వేయడమే అని చెపుతూ ప్రస్తుతం మన హైదరాబాద్ నగరం లో ఐటీ రంగం అభివృద్ధి కి నాటి ప్రధాని రాజీవ్ గాంధీ , ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి ఎంతో కృషి చేశారని , నాడు ఆయన వేసిన బీజాలే నేడు మహావృక్షాలుగా మారి ఆ ఫలాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### రామాయంపేటలో యూరియా కోసం

## తిండి తిప్పలు లేక రైతుల పడిగాపులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 20:- మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని రైతులు వారం రోజులుగా యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బుధవారం నాడు రామాయంపేట పట్టణంలోని ఎరువుల దుకాణాల వద్ద యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు క్యూలో నిలబడి ఉదయం నుండి తిండి తిప్పలు లేక పడిగాపులు కాశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎకరాకు ఒక్క బస్తా మాత్రమే యూరియా ఇస్తుండటంతో సాగు పనులు సక్రమంగా సాగడంలేదని,గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ ఎదురుకాలేదని తెలిపారు.వర్షాలు కురుస్తున్న ఈ సీజన్లో పంటలకు యూరియా అత్యంత అవసరమని వరి ఎదుగుదల కూడా ఆగిపోతుందని,తగినంత ఎరువు లభించకపోవడం వల్ల పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.తమ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికైనా అధికారులు ముందుకు వచ్చి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని,రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 20:- మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన బీర సత్యనారాయణకు ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో మెరుగైన చికిత్స కోసం స్థానిక మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో సీఎంఆర్ఎఫ్ క్రింద 60,000 రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ క్రింద ఆర్థిక సహాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేమే యాదగిరి,కాంగ్రెస్ నాయకులు అల్లాడి వెంకటేశం,బీర రామచంద్రం,మంగలి సత్యం, దోనేటి గోపాల్,మంగలి పవన్ మరియు వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ విద్యావేత్త చిన్న వెంకట్ రెడ్డి మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి .

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన్న వెంకట్ రెడ్డి గారి మరణం పట్ల తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తనను చాలా కలచివేసిందని తెలిపారు. విద్యా వేత్త అయిన చిన్న వెంకట్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు.విద్య ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని విద్యా సంస్థలు నెలకొల్పి లాభాపేక్ష లేని విద్యను చిన వెంకట్ రెడ్డి అందించారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన నెలకొల్పిన మూడు పాఠశాలలు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలుగా నేటికి ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తూనే ఉన్నాయని వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప ప్రకటన ద్వారా తెలిపారు.

## కొండకింది చిన్నవెంకట్ రెడ్డి మృతికి సంతాపం. మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి.

నల్లగొండ ఉమ్మడి జిల్లా.నల్లగొండ సీనియర్ సిటిజన్ ప్రముఖ విద్యా వ్యవస్థ కొండెక్కింది చిన్న వెంకటరెడ్డి మృతికి నల్లగొండ మాజీ శాసనసభ్యులు నంద్యాల నరసింహారెడ్డి ఒక ప్రకటనలో సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. చిన్న వెంకటరెడ్డి నల్లగొండ పట్టణంలో శాంతిని నెలకొల్పడంలో , శాంతి సంఘంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నల్లగొండలో విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వ ప్రవేట్ రంగంలో సంస్థలను స్థాపించే వాళ్లని ప్రోత్సహించారని గుర్తు చేశారు. సాహిత్య రంగానికి కూడా ఆయన ఎనలేని సేవలు చేశారని చెప్పారు. నల్లగొండ పట్టణంలో చిన్న చిన్న వెంకట్ రెడ్డి అంటే తెలియని వారు ఉండరని పేర్కొంటున్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణానికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## ప్రముఖ విద్యావేత్త చిన్న వెంకట్ రెడ్డి మరణం పట్ల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి దిగ్భ్రాంతి

.స్వాతంత్ర్య సమరయోధుడు,ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన్న వెంకట్ రెడ్డి మరణం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.విద్య ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని విద్యా సంస్థలు నెలకొల్పి లాభాపేక్ష లేని విద్యను చిన వెంకట్ రెడ్డి అందించారని కొనియాడారు. ఆయన నెలకొల్పిన మూడు పాఠశాలలు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలుగా ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తూనే ఉన్నాయని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడు,విద్యా వేత్త అయిన చిన్న వెంకట్ రెడ్డి తో మంత్రికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చిన్న వెంకట్ రెడ్డి ఆశయ స్ఫూర్తిని కొనసాగిస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విద్యావేత్త కొండకింది చిన్న వెంకటరెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేస్తే శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

ప్రముఖ విద్యావేత్త, సాహితీ అభిలాషకులు, నల్లగొండ పట్టణ పుర ప్రముఖులు కొండ కింది చిన్న వెంకటరెడ్డి , పార్థివ దేహానికి, మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సాహితీవేత్తగా... నల్లగొండ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ప్రముఖులని, వారి మరణం ఎవరూ పూడ్చలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామంటూ తెలియజేశారు . నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి. తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి, బక్క పిచ్చయ్య, జగ్జీవన్,వీరమల్ల భాస్కర్ తో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# సీబీఐటీలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఒరియెంటేషన్ డే





హైదరాబాద్, శుభోదయం న్యూస్: గండిపేటలోని చైతన్య భారతీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటి)లలో ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఒరియెంటేషన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది. కొత్తగా చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ, వారి అకాడెమిక్ ప్రయాణానికి మార్గనిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ గారు ప్రసంగిస్తూ, ఇంజనీరింగ్ విద్యలో శిస్తు, వినూత్న ఆలోచన, సమగ్ర అభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు కరికులం, పరీక్షా విధానం, క్రెడిట్ అవసరాలు వివరించగా, అధ్యాపకులు వివిధ విభాగాలు, ప్రయోగశాలలు, కేంద్ర లైబ్రరీ, ఇన్నోవేషన్ సెంటర్స్, స్టూడెంట్ సపోర్ట్ సర్వీసులు పరిచయం చేశారు. శ్రీ నరసింహ పిడతల, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ డైరెక్టర్, ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్, గౌరవ అతిథిగా మాట్లాడుతూ: ఇంజనీర్లు పెద్ద కలలు కనాలి. సృజనాత్మకంగా ఆలోచించాలి. రాబోయే నాలుగేళ్ల బి.టెక్ విద్యార్థి జీవితం ఒక ఆసక్తికరమైన అకాడెమిక్ ప్రయాణం అవుతుందని అన్నారు.కష్టాలు ఎదుర్కోవడం ద్వారా మాత్రమే విజయాలు సాధ్యమని, తప్పులనుంచి నేర్చుకోవడం, ప్రతీ అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడం అవసరమని సూచించారు. సహచరులతో కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడం ఎంతో కీలకం అని గుర్తుచేశారు. ప్రొ. విశ్వనాథ్ చింతపెంట, అసోసియేట్ ప్రొఫెసర్, మెకానికల్ %a% ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఐఐటి హైదరాబాద్ మాట్లాడుతూ:ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పునర్నిర్మించుకోవడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా మారడం, సమస్యలు పరిష్కరించడం, విఫలాలనుంచి పునరుద్ధరించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. కంటిన్యుయస్ లెర్నింగ్, క్రిటికల్ థింకింగ్, టీమ్వర్క్, ప్రాక్టికల్ అప్లికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. డా. కె. వీర బ్రహ్మం, సైంటిస్ట్–, అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డి ఆర్ డి ఓ హైదరాబాద్, ముఖ్య అతిథిగా మాట్లాడుతూ:డి ఆర్ డి ఓ భారత సైన్యానికి అత్యాధునిక ఆయుధాలను అందజేస్తుందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్, సెమీ కండక్టర్స్, యాడిటివ్ మాన్యుఫాక్చరింగ్, 3డి టెక్నాలజీ వంటి ఆధునిక అభివృద్ధులను విద్యార్థులు లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు.మల్టీడిసిప్లినరీ నాలెడ్జ్ కలిగి ఉండటం నేటి పరిస్థితుల్లో అత్యవసరమని చెప్పారు.కార్యక్రమం చివర్లో విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ప్రశ్నలు సమాధానాలు సెషన్ జరిగింది.

ఈ ఒరియెంటేషన్ ప్రోగ్రాం, కొత్త విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, ఉత్సాహం పెంపొందిస్తూ, వారి ఇంజనీరింగ్ విద్యా ప్రయాణానికి సానుకూల ఆరంభాన్ని అందించింది.

## ఆగస్టు 25న ఇందిరా పార్క్ దగ్గర ఎంపీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

### బీసీల సత్య గ్రహ దీక్షను విజయవంతం చేద్దాం

### -బీసీలు అందరు ఆహ్వానితులే అధ్యక్షులు..వల్లెపు మాధవరావు

చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లేకుండా స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అధికార కాంగ్రెస్ పార్టీకి బీసీలు తాగిన గుణపాఠం చెప్పాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షులు మాధవరావు డిమాండ్ చేశారు. రిజర్వేషన్ రావడం వలన ఉద్యోగ అవకాశాలు బీసీలకు లభిస్తాయని. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లోపు బీసీలకు 42 శాతం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని . తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలలో బీసీలు పోటీ చేయడానికి ముందు వరుసలో ఉన్నారని. ముఖ్యంగా ఉన్నతమైన చదువులు చదివిన విద్యార్థులకు ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని కనీసం బీసీలకు రిజర్వేషన్ కల్పించడం వలన చదువుకున్న మేధావులు స్థానిక సంస్థలలో సర్పంచగా గెలవడం వలన, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఆగస్టు 25 న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపటనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతీక ప్రకటనలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు వల్లెపు మాధవరావు తెలిపారు . శేరిలింగంపల్లి బిసి కుటుంబ సభ్యులు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయడానికి భారీ సంఖ్యలు తరలి రావాలని ఆయన కోరారు.

## ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా

### -ఫోటో గ్రాఫర్లను ను సన్మానించిన..బలరాం యాదవ్

: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ కాలనీ కి చెందిన గణేష్ యాదవ్, శ్రీనివాస్, నవీన్ ను సన్మానించారు. గత 15 సంవత్సరాలుగా బొటానికల్ గార్డెన్ నుండి చుట్టుపక్కల ప్రాంతాలలో సరైన రోడ్డు సౌకర్యం లేని సమయం నుండి కొండాపూర్ డివిజన్ ప్రజలకు అందు బాటులో ఉంటూ ఫోటో అంటే ఈ భూ ప్రపంచంపై మనిషి జ్ఞాపకాన్ని రూపాన్ని చూపించేదే ఫోటోగ్రఫీ, ఇలాంటి మంచి వృత్తిని ఎంచుకొని ప్రతి ఒక్కరితో స్నేహ భావంగా మెదిలే గణేష్ ను ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నవీన్ బలరామ్ యాదవ్, రమేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, వెంకటేశ్వర్లు, అవదీష్, నారాయణ, జయపాల్ రెడ్డి, అశోక్, సన్నీ యాదవ్, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి క్రుషి చేస్తాం

### -మక్తా కాలనీ వాసులు

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ డివిజన్ పరిధిలో గల మక్త మహబూబ్ పేట్ గ్రామ శివారులో గల మిదికుంట చెరువు కట్ట మైసమ్మ ఆలయాన్నీ అభివృద్ధి చేస్తామని మక్త గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులందరూ కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. త్వరలో ఆలయ అభివృద్ధి కమిటీనీ ఏర్పాటు చేసి, కమిటీ ద్వారా సమష్టి నిర్ణయాలు తీసుకొని మన సంస్కృతి, సంప్రదాయ పండుగలు నిర్వహిస్తూ, భక్తులకు కావాల్సిన అన్ని మౌళిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండె గణేష్ ముదిరాజ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

### -ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

: పఠాన్ చేరు నియోజకవర్గంలోని ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పఠాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పఠాన్ చేరు ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫోటోగ్రాఫర్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, ప్రతినిధులు శంకర్, మహిపాల్ రెడ్డి, పవన్, సునీల్, అనిల్, సాగర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఖేల్ ఉత్సవ్ రన్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

### ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖేల్ ఉత్సవ్ రన్ ఘనంగా

**మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ లో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రంగారెడ్డి జిల్లా డి వై ఎస్ ఓ వెంకటేశ్వర్లు,స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.**

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకుబయలుదేరిన మక్తల్ క్రీడాకారులు

నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలో గత ఏప్రిల్ 25 నుండి 27 వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ బాలబాలికల ఛాంపియన్ షిప్ పోటీలలో నారాయణపేట జిల్లా బాలికల జట్టులో ఆర్. కళ్యాణి,, కె. హేమలత, జి. దివ్య, ఎం. ప్రవీణ, సి. జ్యోతి, ఎస్ .నవ్య శ్రీ, 6 మంది క్రీడాకారిణులు పాల్గొని, అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి,44వ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై, తెలంగాణ షూటింగ్ బాల్ బాలికల జట్టులో స్థానం సంపాదించి, ఆగష్టు 22 నుండి 24 వరకు బీహార్ రాష్ట్రం బుద్ధగయ కాలచక్రం స్టేడియంలో జరుగు జాతీయ స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు బుధవారం 20న వరంగల్ రైల్వే స్టేషన్ నుండి బీహార్ కు తరలి వెళ్లినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొను బాల బాలికలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి.గోపాలం, పీడీలు శంకర్, పవన్ కుమార్ క్రీడా దుస్తులు అందజేసి వారిని అభినందించారు. జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై, తెలంగాణ జట్టు తరపున పాల్గొంటున్న మన జిల్లా క్రీడాకారిణులను, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రివర్యులువాకిటి శ్రీహరి, రాష్ట్ర షూటింగ్ బాల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. శ్రీనివాసులు, సిహెచ్. కళ్ళు ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి.గోపాలం, నారాయణపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యాంజనేయులు, రమేష్ కుమార్, కోశాధికారి విష్ణువర్ధన్ రెడ్డి అభినందించారు.

## బహుజన సమాజ్ పార్టీ మక్తల్ పట్టణ అధ్యక్షులు జి లక్ష్మిన్ఆధ్వర్యంలో నారాయణ గురుజి జయంతి

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో బుధవారం ఉదయం 10:00 ప్రాంతంలో మక్తల్ బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ కార్యాలయంలో మక్తల్ పట్టణ అధ్యక్షులు జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నారాయణ గురుజి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జుట్ల నరేందర్ బి ఎస్ పి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశిష్ట అతిథి గా బండారి చంద్రశేఖర్ బి ఎస్ పి నారాయణపేట జిల్లా కార్యదర్శ మరియు బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కెవి నరసింహ పాల్గొన్నారుఈ సందర్భంగా కార్యక్రమనీ ఉద్దేశించి కె వి నరసింహ, మాట్లాడుతూ నారాయణ గురూజీ చేసిన సేవలను కొనియాడుతూ మందుగా నారాయణ గురూజీ చిత్ర పటానికి పూల మాల వేసి అయన చేసిన సేవలను కొనియాడారు కేరళ రాష్ట్రంలో అక్షరాష్యత పెరగడానికి ముందుగా దేవాలయాలను సైతం పాఠశాలలుగా మార్చిన ఘనత నారాయణ గురూజీది అని అయన కొనియాడారుజుట్ల నరేందర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని సమానత్వం చూడడంలో నారాయణ గురుజి గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తిని కొనియాడారు చంద్రశేఖర్ మాట్లాడుతూ అనధికాలంగా వస్తున్న బహుజన జాతులపై అణచివేతను నారాయణ గురూజీ పోరాటాలు చేయడం జరిగిందని ఆయన అన్నారు పాలెం వెంకటయ్య మాట్లాడుతూ నారాయణ గురుజి లాంటి వాళ్ళని బహుజన సమాజ్ పార్టీ ఎప్పుడు మరవదని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ నారాయణ గురుజి చిత్రపటానికి పూలమాలలు సమర్పిస్తూ కార్యక్రమాన్ని దిగ్విజయగా పూర్తి చేయడం జరిగిందిఈకార్యక్రమంలోమీడియా మిత్రులు మరియు మక్తల్ అసెంబ్లీ నాయకులు పరిషరాం, మాలరెడ్డి,మక్తల్ మండల అధ్యక్షులు జె భేమేష్, వెంకటేష్, ఉషాప్ప,తదితరులు పాల్గొన్నారు

## సామాజిక విప్లవకారుడు ఆధ్యాత్మిక గురువు సామాజిక తత్వవేత్త సంఘసంస్కర్త నారాయణ గురు 169వజయంతి

బుధవారం :వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సంఘసంస్కర్త సామాజికవేత్త నారాయణ గురు 169వ జయంతి ని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ ఒకే కులం ఒకే మతం ఒకే దేవుడంటూ ప్రబోధించికుల వ్యవస్థకు వ్యతిరేకంగా దేవాలయ ప్రాంగణం లో నిలబడి శంఖారావం చేసిన మొదటివ్యక్తి ఆయన దళిత బహుజనులకు విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో గుడులను బడులు గా మార్చి దళిత వర్గాలకు అక్షరాస్యతను ఆత్మగౌరవాన్ని పెంపొందించిన సామాజిక విప్లవకారుడు నారాయణ గురు మతం కోసం మనిషి కాదు మనిషి కోసమే మతం అని చాటి చెప్పాడు.కులం అడగొద్దు కులం చెప్పొద్దు కులం గురించి అసలు మాట్లాడొద్దు అని పిలుపునిచ్చారు తత్వవేత్త కుల వివక్షను అంటరానితనాన్ని అర్థంలేని మూఢాచారాలను నిర్మూలించేందుకు 60 దేవాలయాలను కట్టించి ఆ గుడిలోనే బడులుగా మార్చిఆరాధన స్థలాలు కాక విద్యావ్యాప్తికి కేంద్రబిందువుగా తీర్చిదిద్దాడు బహుజనులకు ధైర్యాన్ని స్థైర్యాన్ని ఆత్మాభిమానాన్ని పెంపొందించిన ఆధ్యాత్మికవేత్త నారాయణ గురు పురుషులతో సమానంగా స్త్రీలు కూడా తప్పనిసరిగా విద్యావంతులు కావాలి విద్యా విషయంలో స్త్రీలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసేందుకు వీలు లేదు ప్రతి ప్రాంతంలో సొంతంగా ఒక సాహితీ సంఘాన్ని గ్రంథాలయాన్ని రీడింగ్ రూం ఏర్పాటు చేశాడు మూఢనమ్మకాలని మద్యపానాన్ని ఆర్థికంగా కుంగదీసే అర్థంలేని ఆచారాలను సంప్రదాయాలను నిరసించారు శివగిరి మఠాన్ని స్థాపించి శివ భక్తుడు గా నిలిచి వందలాది మందిని భక్తులుగా మార్చి సమాజహితం కోసం పాటుపడాలని తన కవితలను రాసి కవి గా నిలిచి వందలాది శ్లోకాలను పాడి శ్రోతలకు గురువై నిలిచి మనుషులంతా ఒక్కటే మనమంతా ఒక్కటే అని నినదించారు రాజా రామ్మోహన్ రాయ్ దయానంద సరస్వతి స్వామి వివేకానంద ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మహాత్మా పూలే అంబేద్కర్ పెరియర్ రామస్వామి నాయకర్ కందుకూరి వీరేశలింగం పంతులు తదితర సంఘ సంస్కర్తలకోవకు చెందిన వ్యక్తి సామాజిక తత్వవేత్త శ్రీ నారాయణ గురు అన్నారు మనమందరము కులరహిత మత రహిత వర్గ రహిత సమాజం కోసం పోరాడాలని ఈ సందర్భంగారాజారాంప్రకాష్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజుగిరిరాజాచారి ప్రజా గాయకుడు చింతకుంట కుర్మయ్య, బోయ రిజర్వేషన్ పోలాట సమితి రాష్ట్ర నాయకుడు కావలి బాలస్వామి నాయుడు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర చారినాయకులు సత్యంచారి రమేష్ చారి ముదిరాజ్ సంఘం నాయకుడు ప్రముఖ న్యాయవాది ఉత్తరయ్య వివిధ సంఘాల నాయకులు జె.రామిరెడ్డి ఎస్.కె.వలి సయ్యద్ మిస్బావుద్దిన్తదితరులు పాల్గొన్నారు

## మరోసారి నిరసన చేపట్టిన మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు




వాషింగ్టన్ : ఇజ్రాయిల్ సైన్యం గాజాలో కార్యకలాపాలు నిర్వహించడానికి, పాలస్తీనియన్లపై నిఘా కోసం తమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడాన్ని నిరసిస్తూ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్‌లోని కంపెనీ తూర్పు క్యాంపస్‌ను ఉద్యోగులు చుట్టుముట్టారు. క్యాంపస్‌లోని " ఫ్రీజోన్" ప్రాంతాన్ని దిగ్భందించి, "జాయిన్ ది వర్కర్ ఇంటిఫడా, నో లేబర్ ఫర్ జెనోసైడ్ ", ప్రాణత్యాగం చేసిన పాలస్తీనా చిన్నారుల కోసం" అన్న ప్లకార్డులను ప్రదర్శించారు. మైక్రోసాఫ్ట్ ఇజ్రాయిల్ నుండి వైదొలగాలని నో అజూర్ ఫర్ జెనోసైడ్ గ్రూప్ డిమాండ్ చేసింది. మైక్రోసాఫ్ట్ నుండి స్పందన లేకపోవడంతో తమ చర్యలను తీవ్రతరం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఒక ప్రదర్శనకారుడు తెలిపారు. గాజాలో విస్తృతంగా వ్యాప్తిచెందిన ఆకలి బాధలు, పోష్టికాహార లోపం మరియు వ్యాధుల గురించి యుఎన్ తరహా సంస్థల నుండి పెరిగిన హెచ్చరికల నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ప్రతీక్షణం పాలస్తీనాలో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయని నిరసనలో పాల్గన్న మైక్రోసాఫ్ట్ ఉద్యోగి నస్రీన్ తెలిపారు. పాలస్తీనాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. బాంబుదాడులకు గురవుతున్నారు, వికలాంగులుగా మారుతున్నారు. మన నిరసనను తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నిరసనకారులపై పోలీసులు జులుం ప్రకటించారు. నిరసన విరమించకుంటే అరెస్ట్ చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో రెండు గంటల తర్వాత ఉద్యోగుల నిరసన ముగిసింది. అజూర్ సాఫ్ట్‌వేర్ వినియోగంపై స్వతంత్ర దర్యాప్తును ప్రారంభిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సంస్థ గతవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

## గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం



జెరూసలెం : గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికను ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఆమోదించారు. ఈ ప్రణాళికను అమలు చేసేందుకు సుమారు 60,000మంది ప్రత్యేకసైన్యాన్ని రప్పించేందుకు అధికారం ఇచ్చారని ఆయన మంత్రిత్వ శాఖ ప్రతినిధి బుధవారం ధృవీకరించారు. గాజాలో సుమారు రెండేళ్లుగా కొనసాగుతున్న అమానుష యుద్ధంలో కాల్పుల విరమణ కోసం మధ్యవర్తులు తమ తాజా ప్రతిపాదనపై ఇజ్రాయిల్ అధికారిక ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్న సమయంలో.. రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ చర్య హమాస్‌పై ఒత్తిడిని మరింత పెంచిందని అన్నారు. సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ముసాయిదాతో సుమారు 50,000 మంది సైనికులను పిలిపిస్తామని ఒక సైనిక అధికారి బుధవారం మీడియాతో పేర్కొన్నారు. దాడి తదుపరి దశలో గాజాలో పనిచేసే ప్రధాన దళాలు గాజా నగరంపై దృష్టి సారించే చురుకైన విధుల దళాలుగా ఉంటాయని అన్నారు. ప్రణాళిక ప్రారంభ దశలో భాగంగా గాజా నగరంలోని జైటౌన్ మరియు జబాలియా పరిసరాల్లో సైన్యం ఇప్పటికే విస్తరించిందని అన్నారు. ఒప్పందం ఏదైనప్పటికీ బందీలందరినీ విడుదల చేయలనే తన పిలుపుపై ప్రభుత్వం ధృఢంగా ఉందని ఇజ్రాయిల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రణాళికపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ బహిరంగంగా స్పందించలేదు. అయితే గతవారం "బందీలందరినీ ఒకేసారి విడుదల చేసే ఒప్పందాన్ని మరియు మా షరతుల ప్రకారం యుద్ధాన్ని ముగించడానికి " తమ దేశం అంగీకరిస్తుందని అన్నారు.

## రాజీవ్‌గాంధీ జయంతి నివాళులర్పించిన ప్రధాని మోడీ, ఖర్గే



న్యూఢిల్లీ : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు మోడీ ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే కాంగ్రెస్ ఎంపి, రాజీవ్‌గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ తన తండ్రికి నివాళులర్పించారు. 'మీ నుండి కరుణ, ప్రేమ, దేశభక్తి వంటి విలువలను వారసత్వంగా పొందాము. మేమందరం ఈ విలువలను ఎప్పటికీ కాపాడుకుంటాము. వాటిని ఎవ్వరూ విచ్ఛిన్నం చేయలేరు. వాటిని ఎవరూ ఆపలేరు. వీటికై వేసే మా అడుగుల్ని ఆపలేరు' అని ఆమె తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇక ప్రియాంకగాంధీ ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ స్మారక చిహ్నం వీర్ భూమి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఆమె వెంట తన భర్త రాబర్ట్ వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా కూడా వెళ్లి నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడ మల్లికార్జున ఖర్గే, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు. 'రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 'సద్భావన దివాస్'గా జరుపుకుంటుంది. ఈరోజు మనం సద్భావన దివాస్ జరుపుకుంటున్న సందర్భంగా లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించి భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీని మనం గుర్తు చేసుకుంటాము. భారతదేశానికి సాధించిన అసంఖ్యాక విజయాలు రాజీవ్ గాంధీ వారసత్వాన్ని ప్రతిబింబించాయి. దేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చాయి. ఆయన జయంతి సందర్భంగా ఆయనకు మా ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నాము' అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు.

## రష్యాపై ఒత్తిడి పెంచేందుకే భారత్‌పై అదనపు సుంకాలు




వాషింగ్టన్ : రష్యాపై ఒత్తిడి పెంచేందుకే భారత్‌పై అదనపు సుంకాలు విధించినట్లు వైట్‌హౌస్ మంగళవారం తెలిపింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించే దిశగా రష్యాపై ఒత్తిడి పెంచే చర్యల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై భారీగా అదనపు సుంకాలు విధించారని పేర్కొంది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలను విధించగా, ఆగస్టు 27 నుండి అమల్లోకి రానున్న మరో 25శాతం అదనపు సుంకాలతో కలిపి భారత్‌పై మొత్తం టారిఫ్‌లు 50శాతం కానున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ తీవ్రమైన ప్రజా ఒత్తిడిని తీసుకువచ్చారని అమెరికా ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. మీరు చూసినట్లుగా భారత్‌పై ఆంక్షలు మరియు ఇతర చర్యలను కూడా తీసుకున్నారని, రష్యాపై ద్వితీయ పక్షం నుండి ఒత్తిడి పెంచడమే వారి ఉద్దేశమని అన్నారు. ఇరుదేశాల మధ్య శాంతి ప్రయత్నాలను వేగవంతం చేయాలని ట్రంప్ ధృడంగా నిర్ణయించుకున్నారని లీవిట్ ఉద్ఘాటించారు. ఈ యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని కోరుకుంటున్నారని ఆమె అన్నారు. యూరోపియన్ నేతలు మరియు నాటో చీఫ్‌లు పుతిన్‌తో ట్రంప్ చర్చలను చర్చలను గొప్ప మొదటి అడుగుగా భావించారని అన్నారు. గత అమెరికా ప్రభుత్వం చర్చలు చేపట్టలేకపోయిందని పేర్కొన్నాయని అన్నారు. తాను అధికారంలో ఉండి ఉంటే యుద్ధం ఎప్పటికీ ప్రారంభమయ్యేది కాదని ట్రంప్ దీర్ఘకాలంగా చేస్తున్న వాదనను లెవిట్ పునరుద్ఘాటించారు. పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారని అన్నారు. యూరోపియన్, నాటో భాగస్వాములతో ట్రంప్ దీర్ఘకాలిక భద్రతా హామీల గురించి చర్చిస్తున్నారని అన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ విలువైన సమయం, శక్తిని వెచ్చిస్తున్నారని అన్నారు.

# మానవ చరిత్రలో ఒక అద్భుత యానం



జాతీయ విమాన యాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఘనంగా జరుపుకుంటారు. మానవ చరిత్రలో అత్యద్భుతమైన విప్లవ ఘట్టాల్లో ఒకటైన గగన యానం సాధనకు గుర్తుగా, విమాన యాన రంగంలో మార్గదర్శకుల కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. రైట్ బ్రదర్స్ 1903 డిసెంబర్ 17న తొలి విజయవంతమైన యాంత్రిక విమానాన్ని ఆకాశంలో ఎగరవేయడం ద్వారా మానవ కలలకు రెక్కలు వచ్చాయి. ఆర్విల్లే రైట్ జన్మదినం ఆగస్టు 19 కావడంతోనే అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ 1939లో ఈ రోజును విమానయాన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సాధించిన పురోగతిని గుర్తు చేసుకుంటూ ఈ రోజును జరుపు కుంటున్నారు. భారతీయ సంస్కృతిలో గగనయాన భావన పూర్వం నుంచే ఉంది. రామాయణం లోని పుష్పక విమానం, మహాభారతం లోని దివ్య రథాలు మన పూర్వికుల ఊహా శక్తిని ప్రతిబింబిస్తాయి. శాస్త్రీయ యుగంలో ఆ కలలు వాస్తవ రూపం దాల్చాయి. భారత దేశంలో విమానయాన చరిత్ర 1911 ఫిబ్రవరి 18న అలహాబాద్ నుండి నైనికి పంపిన పోస్టల్ మెయిల్తో ప్రారంభమైంది. ఆ తర్వాత 1932 అక్టోబర్ 15న జె.ఆర్.డి. టాటా తన డీహావిలాండ్ పూసా-38 విమానం నడిపి కరాచీ నుండి మద్రాస్ వరకు పోస్టు, ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా భారతీయ పౌర విమానయాన రంగానికి నూతన దారులు తీశారు. ఆయన ప్రారంభించిన టాటా ఎయిర్లైన్స్ తరువాత ఎయిర్ ఇండియాగా మారి దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా అందుకే భారతీయ పౌర విమానయాన పితామహుడిగా చిరస్థాయిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం 1953లో ఎయిర్లైన్స్ జాతీయీకరణ చేసి ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్, ఇండియన్ ఎయిర్లైన్స్ను ఏర్పాటు చేసింది. 1990ల ఆర్థిక స్వేచ్ఛా విధానాల తరువాత ప్రైవేట్ రంగానికి అవకాశం లభించడంతో జెట్ ఎయిర్వేస్, సహారా, కింగ్ఫిషర్, స్పైస్ జెట్, ఇండిగో, విస్తారా వంటి విమానయాన సంస్థలు రంగప్రవేశం చేశాయి. ప్రస్తుతం ఇండిగో సంస్థ 60 శాతం మార్కెట్ వాటాతో భారత గగనంలో అగ్ర స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 148 ఆపరేషనల్ విమానాశ్ర యాలు ఉన్నాయనే గణాంకం ఈ రంగం విస్తృతతను తెలియజేస్తుంది. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయం, బెంగళూరు కేమ్పేగౌడ, హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రపంచస్థాయి సౌకర్యాలను కలిగి దేశ గర్వంగా నిలుస్తున్నాయి. 2017లో ప్రారంభమైన ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలు, దూరప్రాంతాలు కూడా గగనతల రవాణాతో అను సంధానమవడం సామాన్య ప్రజలకు విమాన ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 500కి పైగా కొత్త మార్గాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. రక్షణ రంగంలోనూ విమాన శక్తి భారత భద్రతకు కంచుకోటగా నిలిచింది. 1932లో స్థాపించబడిన భారత వైమానిక దళం స్వాతంత్ర్యం తరువాత అనేక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించింది. 1965, 1971 యుద్ధాల్లోనూ, 1999 కార్గిల్ ఘర్షణలోనూ వాయుసేన ప్రదర్శించిన ధైర్య సాహసాలు చరిత్రలో నిలిచి పోయాయి. నేడు టెజాస్ వంటి స్వదేశీ యుద్ధ విమానాలతో పాటు సుఖోయ్-30 ఎంఎంకెఐ, రాఫేల్ వంటి ఆధునిక యంత్రాలు భారత రక్షణ శక్తికి బలాన్నిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనలోనూ విమాన శాస్త్రం పునాదిగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపకల్పన చేసిన ఉపగ్రహ ప్రయోగాలు, చాంద్రయాన్, మంగళయాన్ విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. త్వరలో జరగబోయే గగనయాన్ మిషన్ ద్వారా భారతీయులు అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న సందర్భం విమానయాన దినోత్సవానికి మరింత విశిష్టతనిస్తోంది. ప్రస్తుతానికి భారతీయ విమానయాన రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. రోజూ మూడు వేలకుపైగా విమానాలు దేశ ఆకాశంలో ఎగురుతున్నాయి. 2024లో 36 కోట్లకుపైగా ప్రయాణికులు విమాన సౌకర్యాలను వినియోగించుకున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇండిగో ప్రపంచంలోనే అతిపెద్ద ఎ320 నెరోబాడీ విమానాల వాహక సంస్థగా నిలిచింది. 2030 నాటికి అమెరికా, చైనాల తర్వాత భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద విమానయాన మార్కెట్గా మారబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సమగ్ర పరిణామ క్రమం మనకు ఒక స్ఫూర్తిదాయక సందేశం ఇస్తోంది. జాతీయ విమానయాన దినోత్సవం కేవలం ఒక ఆవిష్కరణ జ్ఞాపక దినం మాత్రమే కాదు. అది మానవ మేధస్సు, ఆవిష్కరణ, ధైర్యసాహసాలకు ప్రతీక. దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధాల ను బలపరచడంలో విమానయానం కీలక పాత్ర పోషించింది. సామాన్య పౌరుడికి కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి రావడం సామాజిక ఆర్థిక అభివృద్ధికి పునాదిగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా నుంచి నేటి ఆధునిక గగనయాన్ వరకు, భారతదేశం విమానయాన రంగంలో నిరంతరం కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ఆకాశమే హద్దు అన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తూ జాతీయ విమానయాన దినోత్సవం ప్రతి భారతీయునికి గర్వకారణంగా నిలుస్తోంది.

# ఈ దువ్వడం వెనకాల?



పంద్రాగస్టున ప్రధాన మంత్రి చేసే ప్రసంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఎందుకంటే దేశంలో నెలకొన్న కీలక పరిణామాలకు మోడీ నోట అనేక సమాధానాలు వస్తాయనేది ప్రజల్లో అంచనా. కానీ, వారి అంచనాలను తలకిందు లు చేస్తూ , దేశం మనసులోని సందే హాలకు ఆస్కారమివ్వకుండా ఇతర చర్చకు హైప్ ఇచ్చేలా మోడీ ప్రసంగం సాగింది. ఇంతవరకు ఏ ప్రధాని మాట్లాడని రీతిలో సుధీర్ఘ సమయం ఉపన్యాసమిచ్చి రికార్డ్‌ను సొంతం చేసుకున్నారని గోడిమీడియా ఆయన్ను ఆకాశానికెత్తుకుంది. కానీ, మోడీ తాను రాజకీయ ఓన మాలు దిద్దుకున్న ఆరెస్సెస్‌పైఔ పొగడ్తల వర్షం కురిపించడం పట్ల దేశం ఒకింతా అసంతృప్తికి లోనైంది. తనను గద్దె దించే పనిలో పడిన ఆరెస్సెస్‌ను ప్రసన్నం చేసుకోవడంలో ప్రధాని ప్రస్తుతానికి సఫలమైనా విపక్షాలను డైలామాలో పడేసే డైవర్ట్ పాలిట్రిక్స్ విషయంలో మాత్రం ఆయన గన్ మిస్‌ఫైర్ అయిందని స్పష్టమైంది. ఆరెస్సెస్‌ను గొప్ప స్వచ్ఛంద సంస్థగా ప్రశంసించడం ద్వారా దేశంలోని అన్ని పక్షాలు ఈ ప్రశంసపైనే చర్చ సాగేలా చేయాలన్నది మ్రోడీ వ్యూహంగా కనిపించింది. దీనికి కారణం లేకపోలేదు. ఆపరేషన్ సిందూర్ మొదలు పాకిస్తాన్‌పై భారతదేశం సీజ్ ఫైర్‌కు ఒప్పుకోవడానికి తానే కారణమని ట్రంప్ పదే పదే ప్రకటనలు చేస్తున్న సందర్భంలో మోడీ సర్కార్ రియాక్షన్‌ను విపక్ష ఇండియా కూటమి పదేపదే లెవనెత్తుతూ మోడీకి చుక్కలు చూపించింది. తాజాగా దొంగ ఓట్ల అంశంపై 'ఓట్ చోర్ గద్ది చోడ్' నినాదంతో రాహుల్ నాయకత్వంలో ఇండియా కూటమి దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. వీటన్నింటికి పంద్రాగస్టు వేడకల్లో ప్రధాని స్పందించి సమాధానమిస్తారని యావత్తు దేశ ప్రజలు ఎదురుచూశారు. కానీ, ఈ అంశం నుంచి ప్రజలతోపాటు విపక్షాలను పక్కదారి పట్టించారు. 'మోడీ గొప్ప ధీశాలి, ఆయన ఛాతి 56 ఇంచులు, ఆయన గుండె ధైర్యం ప్రత్యర్థులకు దడ పుట్టిస్తుంది.' ఇవన్నీ మోడీని తరచూ కీర్తించే వారి నోటి నుంచి వచ్చే పడి కట్టు పదాలు. కానీ మోడీ ట్రంప్‌కు ఎందుకు భయడపుతున్నారన్నది ప్రజలనుంచి వస్తున్న ప్రశ్నలు. ఇటీవల కాలంలో ఇండియా కూటమి నుంచి ప్రశ్నలు వస్తున్నవేళ ఆయన ఆరెస్సెస్‌పై వ్యూహాత్మకం గానే ప్రశంసలు కరిపించినట్టు అర్థమవుతోంది. బీజేపీ అధికారంలోకి రావడానికి, పార్టీకి మొత్తం దిశా నిర్దేశం చేసేదే ఆరెస్సెస్ అని ఘంటాపథంగా చెబుతారు. కానీ, బీజేపీ పెద్దలుగా, కాషాయ ద్వయంగా పేరు గడించిన మోడీ, అమిత్ షా ఈ ఇద్దరూ కూడా ఆ మధ్యకాలంలో ఆరెస్సెస్ అంటే ఎందుకో ఆగ్రహంగా ఉన్నారని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. 2024 ఎన్నికల్లో కూడా వీరు ఆరెస్సెస్‌ని పక్కన పెట్టారన్న బహిరంగ విమర్శ ఉంది. ఇక బీజేపీకి ఎంతో సమర్థత ఉందని, ఆరెస్సెస్ తమకు అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గత లోక్‌సభ ఎన్నికల ముందు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో మోడీకి, ఆరెస్సెస్‌కు మధ్య దూరం మరింత పెరిగింది. అయితే ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడం, రోజురోజుకూ ఇండియా కూటమి ప్రభావం దేశంలో పెరుగుతుండటంతో తానోక్కడినే విపక్షాలను ఎదుర్కోవడం కష్టమని భావిస్తున్న మోడీ వ్యూహాత్మకంగా ఆరెస్సెస్‌ను పొగిడారని తెలుస్తోంది. ఇలా ఆరెస్సెస్‌కు దగ్గరవడం రాబోవు రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ సంస్థ సహాయంతో గెలవాలని ఎత్తుగడ అని ప్రచారం జోరందుకుంది. రాజకీయాల్లో 75 ఏండ్ల వయసు పరిమితని వస్తున్న ప్రమాదం నుంచి గట్టెక్కడం కోసం మోడీ ఓ మెట్టు దిగుతూ వస్తున్నారన్న వాదనలు కూడా కొట్టి పారేయలే స్థితి! మోడీ పదకొండేండ్ల ప్రధానమంత్రిత్వంలో ఎపుడూ సంఘ్‌కార్యాలయానికి వెళ్లింది లేదు. కానీ ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇటీవల కాలంలో నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ సందర్శించి వచ్చారు. ఈ ఘటనలన్నీ చూస్తే మోడీలో ఎన్నడూ కనిపించని భయం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికితోడు విపక్షాలు కూడా అనేక అంశాల్లో గట్టి కౌంటర్ ఇస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరెస్సెస్‌ను ప్రసన్నం చేసుకోవడం మోడీకి అత్యవసరంగా కనిపిస్తోంది. ఈ ఎడబాటు మరింత పెరగకుండా చూసుకునేందుకే, ఆరెస్సెస్‌ను కీర్తిస్తూ పంద్రాగస్టు ఉపన్యాసాన్ని కాషాయమయం చేశారని విశ్లేషకులు బహిరంగం గానే విమర్శలు గుప్పిస్తున్నారు.

# ఇసి తీరుపై ఆరోపణల హోరు




తాంబూలిచ్చేశాం.. తన్నుకు చావండి అన్నట్టుంది ఎన్నికల కమిషన్ వైఖరి. బీహార్ ఓటర్ల జాబితా సవరణ చేపట్టిన దగ్గర నుంచి ఎన్నికల కమిషన్ చర్యలు అత్యంత వివాదాస్పదంగానే ఉంటున్నాయి. ఓటర్ల గుర్తింపునకు ఆధార్ కార్డు చెల్లుబాటు కాదని మొండితనం పట్టడంతో చాలా మంది తమ ఓటు హక్కును కోల్పోయారు. ఈ తీరును ఆక్షేపిస్తూ అనేక పిటిషన్లు సుప్రీంకోర్టుకు దాఖలు కావడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోక తప్పలేదు. మొత్తం 65 లక్షల మందిని తొలగించినట్టు ముసాయిదా జాబితాలో వెల్లడి కాగా, ఆందోళనలు చెలరేగాయి. తొలగించడానికి సరైన కారణాలు వెల్లడించాలని ఇసికి సుప్రీం కోర్టు ఈ నెల 19 వరకు గడువు విధించడంతో సోమవారం (ఆగస్టు 18) ఎన్నికల కమిషన్ తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించింది. ఆబ్సెంట్, షిఫ్ట్, డెడ్ అనే వర్గీకరణ కింద ఓటర్లను తొలగించినట్టు పేర్కొంది. కానీ వచ్చిన అభ్యంతరాలను స్వీకరించడం లేదు. ఎలాంటి తప్పులు లేని అసలు సిసలైన తుది జాబితా ఎప్పుడు వెల్లడిస్తుందో చెప్పలేం. ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం సరైన సమాధానాలు ఇవ్వలేకపోయిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మహారాష్ట్రలో పెద్ద సంఖ్యలో ఓటర్లును చేర్చడం, మహదేవపురంలో ఓటర్ల జాబితాలో లోపాలు, పోలింగ్ ప్రక్రియ వీడియో డేటా తొలగింపు తదితర అక్రమాలపై ఎన్నికల సంఘం మౌనం వహించిందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. హర్యానా, మహారాష్ట్రలో కాంగ్రెస్ వస్తుందని ఒపీనియన్ పోల్ అంచనా వేసినా దానికి వ్యతిరేకంగా జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఉదహరిస్తున్నారు. 2022 లో ఉత్తరప్రదేశ్‌లో 18 వేల ఓట్ల తొలగింపుపై ఇసికి అఫిడవిట్ సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విపక్షాలు ఆరోపించాయి. ప్రతిపక్షాలు తమ ఆరోపణలపై ఎలాంటి అఫిడవిట్లు ఇవ్వలేదంటూ ఎన్నికల కమిషన్ బుకాయిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో నకిలీ ఓటర్ల కార్డుల సమస్యను లేవనెత్తినా ఇంతవరకు పరిష్కరించలేదు. ఆధార్ కార్డును కూడా వ్యక్తిగత గుర్తింపుగా తీసుకోవాలని సుప్రీం కోర్టు చేసిన సూచనలను ఇసి పట్టించుకోవడం లేదు. జాబితాలో బతికి ఉన్నవారిని చనిపోయినట్టు, చనిపోయిన వారిని బతికి ఉన్నట్టు, స్థానికులలో చాలా మంది ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు కారణాలు చూపిస్తోంది. కానీ తాను చేసిన తప్పులను ఇసి దిద్దుకోవడం లేదన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడాన్ని గమనించిన బీహార్‌లోని కొంతమంది ఓటర్లు బూత్ స్థాయి అధికారి (బిఎల్‌ఒ) వద్దకు వెళ్లి తమ ఐడి ప్రూఫ్‌గా ఆధార్ కార్డును చూపించారు. కానీ బిఎల్‌ఒ అంగీకరించలేదు. కేవలం చిన్నచిన్న పొరపాట్లకే బీహార్‌లో ఓటర్లు వేధింపులకు బలవుతున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకపక్క రాహుల్ ఓటర్ అధికార్ ఆందోళనను ప్రారంభించగా, మరోపక్క ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీ ఆరోపణలపై ఆధారాలుంటే వారం రోజుల్లో అఫిడవిట్ సమర్పించాలని, లేకుంటే క్షమాపణ చెప్పాలని అల్టిమేటమ్ జారీ చేయడం ఎంతవరకు సబబు? దీనికి విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. తొలుత ఎన్నికల సంఘమే తన ఓటర్ల జాబితా ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిగ్గా ఉందని సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ పై అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు నోటీసును తీసుకువచ్చేందుకు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారు. మరోవైపు ఓటు చోరీ అంశంపై చర్చించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఓటర్ల నమూనా జాబితాను ఆగస్టు 1న వెల్లడించింది. చనిపోయారని చెబుతూ 22.34 లక్షల ఓటర్లను తొలగించింది. మరో 36.28 లక్షల మంది శాశ్వతంగా తరలిపోయారని లేదా గైరుహాజరయ్యారని తొలగించింది. ఒకటి కన్నా ఎక్కువ చోట నమోదై ఉన్నారని మరో 7.01 లక్షల మందిని తొలగించింది. మొత్తం మీద బీహార్‌లోని మొత్తం 7.93 కోట్ల మంది ఓటర్లలో 8 శాతం మంది పేర్లను జాబితా నుంచి ఎస్‌ఐఆర్‌కు ముందే ఎన్నికల కమిషన్ తొలగించింది. ఎన్నికల కమిషన్ ఎవరినైతే చనిపోయినట్టు ప్రకటించిందో వారిలో చాలా మంది సుప్రీం కోర్టు ముందు ప్రత్యక్షం కావడంతో అన్యాయంగా ఎన్నికల కమిషన్ నేరం చేయడానికి ప్రయత్నించినట్టు స్పష్టమైంది. ఇప్పుడు విరుద్ధమైన విషయం ఏమిటంటే ఆయా ఓటర్లు తిరిగి పోల్ అధికారుల వద్దకు వెళ్లి తామింకా ఉన్నామని నిరూపించుకోవాల్సి వస్తుంది. ఓటర్ల జాబితా నుంచి పౌరుడిని తొలగించడానికి తగిన రుజువు పోల్ ప్యానెల్ వద్ద ఉండడం తప్పనిసరి. అంతేకాని వేరే మార్గం చెల్లదు. జాబితాలో తప్పులకు బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలే బాధ్యులంటూ జాబితా విడుదల చేయడంలో ఎన్నికల కమిషన్ డొల్లతనం బయటపడుతోంది. మరొకరిని ఆరోపించే బదులు జాబితాలోని తప్పులను సవరించడం ఎన్నికల కమిషన్ ప్రధాన విధి. అయితే రాహుల్ మాత్రం బీహార్‌లో ఎస్‌ఐఆర్‌ని ఓటు చోరీకి దొరికిన నూతన ఆయుధంగా వ్యాఖ్యానించారు. బీహార్ లోని 20 జిల్లాల మీదుగా 1300 కిమీ మేర కొనసాగే ఓటర్ అధికార్ యాత్రను రాహుల్ చేపట్టడం ఓటర్ల నుంచి స్పందన విశేషంగా వస్తుండడం అధికార పార్టీకి, ఎన్నికల కమిషన్‌కు మింగుడుపడడం లేదు. సోమవారం ఔరంగాబాద్ జిల్లాలో ఓట్లు కోల్పోయినట్టు చెబుతున్న పౌరులతో రాహుల్ భేటీ అయ్యారు. గత నాలుగైదు ఎన్నికల్లో ఓటు వేసిన వారి ఓట్లను కూడా చోరీ చేశారని రాహుల్ బయటపెట్టారు. పౌరులు ప్రజాస్వామ్యంలో తమ పవిత్రమైన ఓటును పొందడం వారి హక్కు. దాన్ని కాదనే అధికారం ఏశక్తికీ లేదు. ఈ ప్రధాన కర్తవ్యాన్ని ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ గుర్తించడం తప్పనిసరి.